RNI NO. APTEL/2006/18110

## ఈపీఎస్ కనీస పెన్షన్ రూ.3,000కు పెంపు

న్యూఢిల్లీ : పెన్షన్‌దార్లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పనుందా? కనీస పెన్షన్‌ను పెంచే అవకాశాలు ఉన్నట్టు సూచనలు అందుతు న్నాయి. ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం (ఈపీఎస్) కింద రానున్న నెలల్లో కనీస పెన్షన్‌ను రూ. 1,000 నుంచి రూ. 3,000కు పెంచే అవకాశం ఉన్నట్టు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ప్రస్తుతం ఉద్యోగి జీతంలో 12 శాతాన్ని యజమానులు భవిష్య నిధికి చెల్లిస్తున్నారు. ఇందులో 8.33 శాతం ఉద్యోగుల పెన్షన్ స్కీం (ఈపీఎస)కు జమ అవుతుంది. మిగిలిన 3.67 శాతం ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ)లో చేరుతుంది. దీని ఆధారంగా ప్రస్తుతం రూ. 1,000 కనీస పెన్షన్‌గా చెల్లిస్తుండగా, దాన్ని నెలకు రూ. 3,000కు పెంచే అవకాశం ఉందని ఆ అధికారి తెలిపారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

ప్రజాగళం PGN NEWS

నిజామాబాద్ | సంపుటి:21 | సంచిక: 40 | పబ్లిషర్. కొక్కు రవికుమార్ | గురువారం 22 జనవరి 2026 | పేజీలు: 8 | వెల: రూ 1/-




హైదరాబాద్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి తో కలిసి ప్రముఖ నటుడు చిరంజీవి పాల్గొన్నారు. చిరంజీవి ఆ దేశంలోని జ్యూరిక్‌లో ఉన్నారని తెలుసుకున్న సీఎం.. సదస్సుకు రావాలని ఆహ్వానించారు. దీంతో ఆయన హాజరయ్యారు. సదస్సు వేదికపై ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను చిరంజీవి వీక్షించారు. అంతర్జాతీయ వేదికపై తెలంగాణ అభివృద్ధి దృక్పథాన్ని ఈ డాక్యుమెంట్ ప్రతిబింబించింది. అనంతరం చిరంజీవితో రేవంత్ మాట్లాడుతూ తమ కుటుంబసభ్యులతో కలిసి 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా వీక్షించానని.. ఎంతో ఆస్వాదించానని తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవికి సీఎం అభినందనలు తెలిపారు. చిరంజీవి తన కుటుంబంతో కలిసి విహారయాత్ర నిమిత్తం స్విట్జర్లాండ్ వెళ్లారు. ఈ సమయంలోనే దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సు జరుగుతుండటంతో సీఎం రేవంత్‌రెడ్డి.. చిరంజీవిని అక్కడికి ఆహ్వానించారు.

## దావోస్.. హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలి: సీఎం రేవంత్




దావోస్ : వరల్డ్ ఎననామిక్ ఫోరం ఫాలోఅప్ సదస్సును ఏటా నిర్వహించాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరుగుతున్న సదస్సులో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు.

ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్‌లో దీన్ని నిర్వహించాలని కోరారు. సీఎం ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు మద్దతు తెలిపారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డితో బ్లైజ్ కో ఫౌండర్ సీఈవో దినకర్ మునగాల భేటీ అయ్యారు. హైదరాబాద్ బ్లైజ్ ఆర్ అండ్ డీ సెంటర్ విస్తరణకు తెలంగాణ ప్రభుత్వంతో ఆయన ఎంవోయూ కుదుర్చుకున్నారు.




హైదరాబాద్ : త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. జాగృతి ఇంకా పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారలేదని.. అందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని స్పష్టం చేశారు.

తెలంగాణ ఉద్యమకారుడు ముచ్చర్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కవిత మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎవరు మద్దతు కోరినా ఇస్తామని కవిత తెలిపారు. అవసరమైన చోట తనతో పాటు జాగృతి నేతలు ప్రచారం చేస్తారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసు తుదిదశకు చేరుతుందనే నమ్మకం తనకు లేదన్నారు. తనలాంటి బాధితులకు న్యాయం జరిగే అవకాశం లేదని చెప్పారు. కావాలనే హరీశ్‌రావుకు సిట్ నోటీసులు ఇచ్చి డైవర్షన్ చేస్తున్నారన్నారు. ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ ఉద్యమకారుల విగ్రహాలు ఉండాలన్నారు. ముచ్చర్ల సత్యనారాయణ విగ్రహం అక్కడ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు.

## కవిత ప్రశ్నలకు బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పలేదు: మంత్రి పొన్నం




హైదరాబాద్: సింగరేణిపై బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. గత ప్రభుత్వం 30 శాతం అధిక కేటాయింపులతో టెండర్లు అప్పగించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కాంట్రాక్టులు పొందిన వాళ్లు.. ఇప్పుడు చెడ్డవాళ్లయ్యారా అని మంత్రి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పొన్నం మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ఎంతో అవినీతి జరిగినట్లు కవిత చెప్పారని.. ఆమె ప్రశ్నలకు ఆ పార్టీ నేతలు సమాధానం ఇవ్వలేదన్నారు. హిల్ట్ పాలసీలపైనా ఇలాగే ఆరోపణలు చేశారని.. అసెంబ్లీలో చర్చ పెడితే బహిష్కరించి వెళ్లిపోయారని చెప్పారు.

## సింగరేణిపై సీబీఐ దర్యాప్తునకు రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుంది: కిషన్‌రెడ్డి




దిల్లీ: దేశ బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి కీలకపాత్ర పోషిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అయితే, తెలంగాణ వచ్చాక సింగరేణికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. సింగరేణి విషయంలో వివాదం నెలకొన్న నేపథ్యంలో ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు సింగరేణిని అన్ని రకాలుగా విధ్వంసం చేశాయని ఆరోపించారు. నైనీ కోల్? బ్లాక్? విషయంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ వెళ్తోందని విమర్శించారు. సింగరేణి రాజకీయ ప్రయోగశాలగా మారిందన్నారు. "బీఆర్?ఎస్? హయాంలో అనేక రకాల అక్రమాలు జరిగాయి. రాష్ట్ర విద్యుత్ సంస్థలకు విద్యుత్ కోసం తెలంగాణకు నైనీ కోల్ బ్లాక్? కేటాయించారు. దానికి కేంద్రం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలున్నాయి. గతంలో నైనీ కోల్ బ్లాక్ టెండర్ల ప్రక్రియలో సీఎం జోక్యం చేసుకొని రద్దు చేశారు. సింగరేణి మైనింగ్‌కు ముందుకొస్తే బీఆర్ఎస్ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టింది. బొగ్గు గనుల కొరత ఉందని తెలిసి ప్రైవేటు వ్యక్తులకు ఎలా ఇస్తారుసింగరేణి, నైనీ కోల్ బ్లాక్ అక్రమాలపై చర్చ జరగాలి. సీబీఐ దర్యాప్తునకు రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుంది" అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.




## అభివృద్ధి అంటే భవనాల నిర్మాణమే కాదు.. ప్రజల జీవితాల్లో మార్పు: భట్టి విక్రమార్క

ధర్మపురి గ్రామీణం: తెలంగాణలో విద్య, వైద్యం, అన్ని వర్గాల సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో బుధవారం రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనం, రూ. 10 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం, రూ. 17 కోట్లతో వాటర్ ప్లాంటు నిర్మాణం, రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో ఎస్సీ బాలుర వసతిగృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. "జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాల నిర్మాణానికి రూ. 200 కోట్లు కేటాయించాం. ఒకే ప్రాంగణంలో విద్య, ఆటలు, హాస్టల్, ల్యాబ్స్, డైనింగ్, క్రీడలు అన్నీ ఉండేలా ప్రణాళిక రూపొందించాం. పేద కుటుంబాల పిల్లలకు మంచి అవకాశాలు ఇస్తే వారు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని మేం నమ్ముతున్నాం. వెనుకబడిన వర్గాలు చదువులు, ఉద్యోగాల్లో, సమాజ నిర్మాణంలో ముందుకు రావాలంటే ప్రభుత్వం తరఫున చేయాల్సిన కృషి చేస్తున్నాం. అభివృద్ధి అంటే కేవలం భవనాల నిర్మాణం కాదు, ప్రజల జీవితాల్లో మార్పు రావడం. ఎన్నికల సమయంలో చేసిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. పారదర్శకత, నిబద్ధత, సంకల్పంతో ముందుకు సాగుతున్నాం" అని భట్టి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




## మార్కెట్లపై బేర్ పట్టు.. 1000 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ రాజకీయ భౌగోళిక అనిశ్చితుల నేపథ్యంలో సూచీలు భారీగా పతనమవుతున్నాయి. ఉదయం 11.05 గంటల సమయంలో సెన్సెక్స్ 886 పాయింట్ల నష్టంతో 81,295 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 250 పాయింట్లు క్షీణించి, 24,981 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్ ఒక దశలో 1000 పాయింట్లు కోల్పోయింది. **మార్కెట్ పతనానికి కారణాలు..** అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ అంతకంతకూ క్షీణిస్తోంది. నేటి సెషన్?లో తొలిసారి ఏకంగా 91.28కి పడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోన్న అనిశ్చితులు, డాలర్లకు గిరాకీ పెరగడం వంటి కారణాలు రూపాయి విలువపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఇక, దక్షిణకొరియా, జపాన్, హాంకాంగ్ వంటి ఆసియా మార్కెట్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. నిన్న అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు భారత స్టాక్ మార్కెట్ నుంచి భారీగా నిధులు వెనక్కి మళ్లించడం సూచీల పతనానికి ఓ కారణం. నిన్న ఒక్కరోజే రూ. 2,938.33 కోట్లు ఉపసంహరించుకున్నారు. జనవరిలో వరుసగా 11వ సెషన్?లోనూ ఈ అమ్మకాలు కొనసాగడం గమనార్హం. మార్కెట్ అస్థిరతను కొలిచే వీఐఎక్స్? నాలుగుశాతం పెరిగి 13.22కి చేరింది. ట్రంప్ టారిఫ్ ప్రకటనలతో మదుపర్లు అప్రమత్తతో వ్యవహరిస్తున్నారు. గ్రీన్‌లాండ్ స్వాధీనానికి సహకరించని ఐరోపా యూనియన్ దేశాలపై సుంకాల ప్రకటనలు అంతర్జాతీయ వాణిజ్యంలో అంతరాయాలను కలిగిస్తున్నాయి. బ్యాంకింగ్ షేర్లు కుదేలవడం మిగతా రంగాల పైన కూడా ప్రభావం చూపుతోంది.




## మేడారం మహాజాతరకు సింగరేణి సన్నద్ధం..

వరంగల్: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు సింగరేణి సమాయత్తమవుతోంది. ప్రతీ జాత ర లాగానే ఈసారి కూడా జరిగే జాతరలో విధులు నిర్వర్తించేందుకు మూడు విభాగాల సిబ్బందిని సింగరేణి ఎంపిక చేసింది. జాతరకు వారం రోజుల ముందు నుంచి విధుల్లో చేరి జాతర పూర్తిగా ముగిసే వరకు పని చేసేందుకు ప్రణాళికలు రూపొందించు కున్నారు.

ఇందులో భాగంగా మంగళవారం భూపాలపల్లి కేంద్రం నుంచి రెండు విభాగం తరలివెళ్లగా.. ఈ నెల 25వ తేదీన మరో విభాగం తరలివెళ్లేలా సిద్ధమవుతున్నారు.

**మూడు విభాగాల్లో 56 మంది..** సింగరేణి ఏరియాలో మూడు విభాగాల్లో పని చేస్తున్న 56 మందిని సింగరేణి యాజ మాన్యం ఎంపిక చేసింది. వీరిలో రెస్క్యూ విభాగం నుండి 20మంది, స్విమ్మర్స్? 16 మం ది, స్కౌట్స్ విభాగం నుండి 20 మంది జాతర లో విధులు నిర్వర్తించనున్నారు. వీరందరికి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. తల్లుల సన్నిధిలో సేవ చేసే భాగ్యం రావడం ఆనందంగా భావించాలని సూచించారు.

**ప్రధాన విధులివే..** మేడారం జాతర సక్సెస్ కావాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే నే అది సాధ్యమవుతోంది. అయితే, కొన్ని ప్రధాన శాఖల్లోని వారు ఎంతో బాధ్యతాయు తంగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. వీరి విధుల నిర్వహణతోనే వచ్చే భక్తులకు సేవలు అందనున్నాయి. అయితే, కొన్ని ప్రధాన శాఖ ల అధికారులు, సిబ్బంది మరింత సమర్థతతో పని చేయాల్సి ఉంటుంది. ఇదే తరహాలో సింగరేణిలో పనిచేసే ఈ మూడు విభాగాల సిబ్బంది విధులు సైతం కీలకమే కానున్నా యి. విధులకు తరలివెళ్లే రెస్క్యూటీమ్ 20మంది గద్దెల ప్రాంగణంలో విధులు ఉండనున్నారు. ఇక్కడ భక్తులకుఎదరయ్యే సమస్యలపై వీరు సత్వరమే స్పందించనున్నారు. ప్రధానంగా ఏదైన అనుకొని ప్రమాదం జరిగితే ఫస్ట్ ఎయిడ్ చేయడం, సీపీఆర్ చేయడం, త్వరితగతిన వైద్య సదుపాయం అందించేలా చూడటం వంటివి చేస్తారు. అలాగే, 16 మంది స్విమ్మర్స్? జంపన్న వాగులో ఉంటూ ప్రమాదమేమైనా చోటు చేసుకుంటే వెంటనే స్పందించనున్నారు. నిరంతరాయంగా ఈ స్విమ్మర్స్? విధులు ఉండనున్నాయి. ఇక స్కౌట్స్ సిబ్బంది జంపన్నవాగు సమీపంలోనే అందుబాటులో ఉంటూ తలనీలాలు సమర్పించే వారు నీళ్లలో వాటిని వేయకుండా, క్యూలైన్లో వేచి చూసేవారికి వాటర్ బాటిళ్లు అందించడం, పరిసరాలను ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులచే శుభ్రం చేయించే ప్రధాన విధులు వీరంతా నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

# సంపాదకీయం

## అర్బన్ నక్సలైట్లు...
## మోడి పేల్చిన పొలిటికల్ డైనమేట్

అర్బన్ నక్సలైట్లు అన్నది ఇప్పటిదాకా ఏదో స్థాయిలో ఉన్న నేతలు అనడమే అంతా చూశారు. కానీ సువిశాలమైన భారత దేశానికి నాయకత్వం వహిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ వంటి వారి నోటి నుంచి ఈ మాట రావడం నిజంగా షాకింగ్ పరిణామమే అని అంటున్నారు. అంతే కాదు అర్బన్ నక్సలైట్లను అక్రమ వలసదారులను కలిపి మరీ మోడీ తాజాగా విమర్శించారు. ఈ రెండు ఫ్యాక్టర్లు జాతీయ భద్రతకు పెను ముప్పు అని కూడా ఆయన స్పష్టంగా చెప్పారు. ఒక విధంగా అర్బన్ నక్సలైట్లు గురించి మాట్లాడుతూ పొలిటికల్ గా డైనమేట్ నే పేల్చారు అని అంటున్నారు.

**వారితోనే ముప్పు :** దేశంలో అక్రమంగా చొరబడి జనాభా అసమతూల్యతకు ముప్పు తెస్తున్న వారు అక్రమ వలసదారులు అని ప్రధాని అన్నారు. వారు ఎలా దేశంలోకి ప్రవేశించారో అలాగే వెనక్కి తిరిగి పంపించేయాలని ఆయన అన్నారు. ఓటు బ్యాంక్ రాజకీయాల మీద కూడా ఆయన తీవ్ర విమర్శలే చేశారు. ఈ తరహా రాజకీయాలు ప్రమాదం అన్నారు, అదే సమయంలో అర్బన్ నక్సలైట్లు గురించి ప్రస్తావించారు వారు సైతం జాతీయ భద్రతకు పెను ముప్పుగా మారారని అన్నారు. ఇలా చెబుతూ ఇవన్నీ దేశం ముందు ఉన్న అతి పెద్ద సవాళ్ళుగా మోడీ అభివర్ణించారు. బీజేపీ నూతన అధ్యక్షుడి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతూ మోడీ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు.

**ఏ దేశమూ అంగీకరించదు :** ఈ సందర్భంగా పరోక్షంగా అమెరికా దేశాన్ని మోడీ ప్రస్తావిస్తూ ప్రపంచానికి తామే అధిపతులమని భావించే కొన్ని సంపన్న దేశాలు శక్తివంతమైన దేశాలు కూడా అక్రమ వలసదారులను గుర్తించి మరీ వెనక్కి పంపుతున్నాయని అన్నారు. వారు ఏమి చేసినా ఆ చర్యలను ఎవరూ ఏమీ అనడం లేదని అన్నారు భారత్ లో మాత్రం తిష్ట వేసుకుని కూర్చున్న అక్రమ వలసదారులను వెనక్కి పంపడం ఏ విధంగా అన్యాయం అవుతుందని ఆయన ప్రశ్నించరు. పేదలకు దేశ ప్రజలకు దక్కాల్సిన అన్ని రకాల సదుపాయాలను దోచుకోవడం తగునా అని నిలదీశారు. దీనిని భారత్ ఎప్పటికీ అనుమతించదని ఆయన స్పష్టం చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాల వల్లనే అక్రమ వలసదారులకు మద్దతు పలుకుతున్నాయని ఆయన విమర్శించారు.

**అర్బన్ నక్సలైట్లు ప్రమాదం :** ఈ రోజున అతి పెద్ద సవాల్ గా ఉన్నది అర్బన్ నక్సలైట్లు అని ఆయన చెప్పుకొచ్చారు వీరంతా ప్రపంచవ్యాప్తంగానూ తమ ప్రభావాన్ని విస్తరిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ గురించి ఎవరు మంచిగా రాసినా పొగిడినా వీరు తట్టుకోలేకపోతున్నారు అని ఆయన అన్నారు వారిని వేధిస్తున్నారని అన్నారు. అర్బన్ నక్సలైట్లు శైలి ఏమిటి అంటే బీజేపీని అంటరాని పార్టీగా చూడడం, ఏకాకిగా చేయడం అని ఆయన ఫైర్ అయ్యారు, కానీ వారి ఎత్తులు పారడం లేదని దేశం అన్నీ గమనిస్తోంది అని మోడీ అన్నారు. దేశానికి హాని చేయడానికే అర్బన్ నక్సలైట్లు నిరంతరం పనిచేస్తున్నారని మోడీ తీవ్ర వ్యాఖ్యలే చేశారు. బీజేపీ తన సంస్థాగతమైన బలంతో పాటు ఫిలాసఫీ ద్వారానే అర్బన్ నక్సలైట్లు ఫిలాసఫీని ఓడించాలని ఆయన చెప్పుకొచ్చారు.

**కాంగ్రెస్ హాట్ కామెంట్స్ :** ఇదిలా ఉంటే అర్బన్ నక్సలైట్లు అంటూ మోడీ విమర్శించడాన్ని కాంగ్రెస్ తప్పు పట్టింది. హోం శాఖ సైతం అర్బన్ నక్సలైట్లు అన్న పదం ఎక్కడా వాడదని పార్లమెంట్ లో కేంద్రం ఇచ్చిన సమాధానంలో అదే ఉంటుందని చెప్పింది. కానీ మోడీ మాత్రం అర్బన్ నక్సలైట్లు అని విమర్శలు చేస్తున్నారని మోడీని వ్యతిరేకిస్తే అర్బన్ నక్సలైట్లు అయిపోతారా అని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సామాజిక మాధ్యమం ద్వారా ప్రశ్నించారు. మొత్తానికి అర్బన్ నక్సలైట్లు అంటూ మోడీ చేసిన ఈ కామెంట్స్ రాజకీయ చర్చకు ఆస్కారం ఇస్తున్నాయి. కాంగ్రెస్ అయితే గట్టిగానే విమర్శిస్తోంది.

- కొక్కు రవికుమార్

# డివిజన్ లతో పాటు నగర సుందరికరనే నా ధ్యేయం

**ఏం సాధించారని కాంగ్రెస్ నాయకులు కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజల ముందుకు వచ్చి ప్రచారం చేస్తారు..**

**పలు అభివృద్ధి భూమి పూజ కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**




నిజామాబాద్ జనవరి 21: (ప్రజా గళం ప్రతినిధి) రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిపోయినప్పటికీ ముఖ్యంగా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఏం సాధించి పెట్టారని రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఏం మొహం పెట్టుకొని ప్రజల ముందుకు వచ్చి ఓట్లు అడుగుతారని ఇందూరు అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇందుకు ఉదాహరణనే తాను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా గెలిచి రెండు ఏళ్ళు గడుస్తున్నప్పటికీ, తనకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యే ఫండ్ కింద ఒక్క పైసా కూడా మంజూరు చేయని చేతకాని ప్రభుత్వం అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు మేయర్ పీఠం మాదే అని విజయం తమదే అని మాయమాటలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. ఈ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మూడు నుంచి ఐదు సీట్లు కూడా రావని ఎమ్మెల్యే ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఇస్తానన్న 2,500 రూపాయలు ఎక్కడ అని అలాగే 2000 పెన్షన్ దారులకు 4000 మరియు 4000 పెన్షన్ దారులకు 6000 చేస్తామని గొప్పలు చెప్పిన రేవంత్ సర్కార్ ఇప్పుడు తమ దగ్గర ఖజానా లేదని చేతులు ఎత్తేయడం ఏంటని ప్రశ్నించారు. బిజెపి ఎక్కడ ఉందో అక్కడ అభివృద్ధి మరియు విశ్వాసం ఉంటుందని ప్రజల్లో ఒక నమ్మకం ఏర్పడిందన్నారు. రాబోయే ఇందూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేషన్ పై బిజెపి జెండా ఎగరవేయడం ఖాయమని అన్ని సర్వేల్లో చెబుతున్నాయని మరి ముఖ్యంగా కాంగ్రెస్ చేపట్టిన సర్వేలో కూడా అదే వెలువడిందని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి మేయర్ అయ్యాక ఇప్పుడు చేపడుతున్న డివిజన్ కు కోటి రూపాయల అభివృద్ధి కాకుండా రెట్టింపు స్థాయిలో నిధులు మంజూరు చేస్తామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. ముఖ్యంగా ప్రజలు ఎదురుచూస్తున్న డ్రైనేజీ వ్యవస్థను కోటి రూపాయల ఫండ్ తోనే కాకుండా ఇతర నిధులతో శాశ్వత పరిష్కారం చూపుతామని భరోసానిచ్చారు. గత రెండు మూడు రోజులుగా పలు డివిజన్లలో పర్యటిస్తున్న తనకు ప్రజలు విశేషంగా మద్దతు తెలుపుతున్నారని కొనియాడారు.

కాంగ్రెస్ అంటే ముస్లింలు, ముస్లింలు అంటే కాంగ్రెస్ పార్టీ అని రేవంత్ రెడ్డి అనడం తనకు హిందువుల పై ఉన్న అగౌరవాన్ని ప్రదర్శిస్తుందని కావున రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు బిజెపికి అండగా నిలబడి బిజెపి పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం టి యు ఎఫ్ ఐ డి సి లో మంజూరు చేసిన డివిజన్ కి కోటి రూపాయల అభివృద్ధి పనులలో భాగంగా నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ బుధవారం 45 వ డివిజన్, 22 వ డివిజన్, 6 వ డివిజన్, 23 వ డివిజన్, 25 డివిజన్, 24 వ డివిజన్, 7 వ డివిజన్, 26 వ డివిజన్, 40 డివిజన్, 41వ డివిజన్, 42 వ డివిజన్, 47 డివిజన్ మరియు 48 డివిజన్ ప్రాంతాలలో భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాలలో డివిజన్ వాసులు హెల్త్ ఏఈ శంకర్ పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్స్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

నిజామాబాద్ బ్యూరోజనవరి 21 ( ప్రజా గళం) జిల్లా కేంద్రంలోని అర్సపల్లి లో గల ఏ.వీ ఎంటర్ ప్రైజెస్ కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్ సెంటర్ లో కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. 175 మంది విద్యార్థులకు గాను ఉదయం సెషన్ పరీక్షకు 173 మంది, మధ్యాహ్నం సెషన్ పరీక్షకు 171 మంది హాజరయ్యారని కేంద్రం నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాగా, సీ.సీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా?



సరిపడా పోలీసు బందోబస్తు ఉందా అని పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో తాగునీటి వసతి, జెనరేటర్ ఇత్యాది వసతులు అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ వెంట పరీక్ష కేంద్రం అబ్జర్వర్ శ్రీకాంత్, సెంటర్ ఇంచార్జి జావీద్, నార్త్ తహసీల్దార్ విజయ్ కాంత్ తదితరులు ఉన్నారు.

# పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్

నిజామాబాద్ బ్యూరో జనవరి 21 ( ప్రజా గళం) మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో నిజామాబాద్ నగర పాలక సంస్థకు సంబంధించిన ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ వంటి వాటి కోసం ఈ కళాశాలలో అనువుగా ఉన్న ఆయా విభాగాల గదులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రవాణా, పార్కింగ్ సదుపా




యాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలన జరిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులతో కౌంటింగ్, డిస్ట్రిబ్యూషన్ కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ సాఫీగా జరిగేలా, అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

# ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి....

**సురక్షితంగా బయ టకు వచ్చిన వాహనదారులు,సురక్షితంగా ఇల్లు చేరు కోవాలి....**

**ప్రభుత్వ ప్రధాన సలహాదారు,బోధన ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి సూచన....**

**దూపల్లి గేట్ వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన...**



ఎడపల్లి,జనవరి 21: (ప్రజా గళం)ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రమాదాలు జరగకుండా నివారించుకోవాలని ప్రభుత్వ ప్రధాన సలహాదారు,బోధన్ ఎమ్మెల్యే,పొద్దుటూరి. సుదర్శన్ రెడ్డి సూచించారు.బుధవారం బోధన్- నిజామాబాద్ ప్రధాన రహదారిపై,ధూపల్లి గేట్ వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన "అరైవ్ అలైవ్"అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు.అంతకుముందు విద్యార్థులకు,వాహనదా రులకు రోడ్డు భద్రతత పై అవగాహన కల్పించారు. పోలీస్ శాఖ తరపున వాహనదారులకు హెల్మెట్ లను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పంపిణి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రభుత్వం కూడా ప్రయా ణికుల ఇక్కట్లను గమనించి ప్రభుత్వ శాఖల ద్వారా పలు సూచనలు అందజేస్తుందని అన్నారు.ధూపల్లి క్రాసింగ్ బ్లాక్ స్పాట్ గా పోలీసులు గుర్తించారని అందు కే ఇక్కడ ఆర్ అండ్ బి శాఖ అధికారులకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.ద్విచ క్ర వాహనాలు నడిపే వారందరూ కూడా హెల్మెట్లు ధరించాలని సూచించారు.ఇంటి నుంచి బయటకు ఏ విధంగా బయటకు వెళ్లి రోడ్డుపై ప్రయాణం చేస్తారో అంతే క్షేమంగా ఇంటికి చేరడం ముఖ్యమని అన్నారు. ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలు జరగకుండా,మద్యం సేవించి వాహనాలు నడపకుండా కఠిన చర్యలు తీసు కుంటుందని అన్నారు.కొంతమంది హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా హెల్మెట్ లను పంపిణి చేశారు.బోధన్ ఎసిపి శ్రీనివాస్ మాట్లాడుతూ..పోలీసు శాఖ ఆధ్వర్యం లో ప్రతి గ్రామంలోనూ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.ఆక్సిడెంట్లు తగ్గించ డానికి ఈ అరైవ్ అ లైవ్ ప్రోగ్రాం చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు, మోటర్ వెహికల్ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్,ఎడపల్లి,బోధన్, రెంజల్ ఎస?లు ముత్యాల రమ,మచ్చేందర్ రెడ్డి, రఘుపతి,ఏఎస? లు రేణుక,బాలికల గురుకుల పాఠ శాల విద్యార్థినిలు,పిఈటి ప్రసూన,పలు గ్రామాలనుండి వచ్చిన యువకులు పాల్గొన్నారు.పలువురు మహిళలు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలపై వెళుతున్న వారికి గురుకుల విద్యార్థులతో గులాబీ పువ్వులు ఇచ్చి వాహ నదారులను పోలీసులు అభినందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హందాన్,గ్రంథాల సంస్థ చైర్మన్ అంతి రెడ్డి రాజా రెడ్డి, మాజీ నగర మేయర్ ధర్మపురి సంజయ్,నాయకులు భాస్కర్ రెడ్డి,రాధాకిషన్ గౌడ్,నీరడి రవికుమార్, కిషోర్, తాహేర్,ఎంబమోహన్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సాటాపూర్ గేట్ వద్ద గుర్తు తెలియని వాహనం"ఢీ" కొని వృద్ధునికి గాయాలు....

ఎడపల్లి,జనవరి 21: (ప్రజా గళం)ఎడపల్లి మండలం సాటాపూర్ గేట్ వద్ద గుర్తు తెలియ ని వాహనం"డీ"కొని వృద్ధుడికి తీవ్ర గాయాలు అయ్యా యి.సైకిల్ పై వెళ్తున్న ఓ వృద్ధుడినివాహనం"ఢీ"కొట్టడం తో తీవ్ర గాయాలైన వృద్ధుడిని 108 ఆంబులెన్స్ లో చికిత్స నిమిత్తం




బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.గాయపడ్డ వృద్ధుడు రెంజల్ మండలం తాడ్ బిలోలి గ్రామానికి చెందినట్లుగా గుర్తించారు. గాయపడ్డ వృద్ధుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.




బంగారం, వెండి ధరల పరుగు ఆగట్లేదు. రోజురోజుకీ పెరుగుతూ కొత్త రికార్డులను అధిగమిస్తున్నాయి. ఇప్పటికే రూ.లక్షన్నర దాటిన మేలిమి (24 క్యారెట్లు) బంగారం 10 గ్రాముల ధర బుధవారం మరింత పెరిగింది. హైదరాబాద్? మార్కెట్లో నేటి ఉదయం 11.45 గంటల సమయంలో పసిడి ధర ఏకంగా రూ.1.61 లక్షలు పలికింది. క్రితం రోజుతో (రూ.1,52,800) పోలిస్తే దాదాపు రూ.9వేలు పెరగడం గమనార్హం. ఇక, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,41,900కు చేరింది. మరోవైపు, వెండి ధర కూడా దూసుకెళ్తోంది. నేటి మార్కెట్లో కిలో వెండి ధర రూ.3,30,000గా ఉంది. క్రితం రోజుతో పోలిస్తే ఇవాళ వెండి ధర దాదాపు రూ.14వేలు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్?లో ఈ లోహాల ధరలు జోరుగా పెరుగుతున్నాయి. ఔన్సు వెండి ధర చరిత్రలో తొలిసారి 94 డాలర్ల మార్క్?ను దాటి పయనిస్తోంది. ఇక ఔన్సు బంగారం ధర 4,849 డాలర్లను చేరింది. గ్రీన్‌లాండ్ స్వాధీనానికి, గాజా శాంతిమండలిలో సభ్యత్వానికి సహకరించడం లేదంటూ ఐరోపా దేశాలపై, ఫ్రాన్స్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్? భారీ సుంకాలను ప్రకటించారు. దీంతో అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధ భయాలు పెరిగాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బంగారం, వెండిని మదుపర్లు సురక్షిత పెట్టుబడి సాధనాలుగా భావించడంతో వీటి ధరలు గణనీయంగా పెరుగుతున్నాయని బులియన్ మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు కొత్త ఇంధన రంగాలు, విద్యుత్తు వాహనాల తయారీ రంగాల నుంచి వెండికి గిరాకీ అంతకంతకూ పెరుగుతుండడంతో దానికి విపరీతంగా డిమాండ్ ఏర్పడింది.

## వ్యక్తిపై తేనేటీగల దాడి...పరిస్థితి విషమం...సకాలంలో స్పందించి అస్పత్రికి తరలించిన 108 సిబ్బంది..అభినందించిన వైద్యులు,కుటుంబ సభ్యులు...



ఎడపల్లి,జనవరి 21: (ప్రజా గళం)నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం అంబం(వై) గ్రామానికి చెందిన జడగల గంగారాం అనే వ్యక్తిపై బుధవారం తేనెటీగలు దాడి చేయడంతో పరిస్థితి తీవ్రంగా మారింది.వివరాల్లోకి వెళితే...ఎడపల్లి మండలం అంబం (వై)గ్రామానికి చెందిన గంగారాం కూరగాయల వ్యాపారం చేస్తూ బెల్లాల్ గ్రామానికి చేరుకున్నాడు.అక్కడ తనపై తేనెటీగలు ఒక్క సారిగా దాడి చేయడంతో పరిస్థితి విషమంగా మారింది. స్థానికులు 108 ఆంబులెన్స్ కు సమాచా రం ఇవ్వగా, అక్కటికి చేరుకున్న ఎడపల్లి 108 సిబ్బంది లక్ష్మణ్ ఆసిఫ్ లు ప్రథమ చికిత్స చేసి బోధన్ ఏరియా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తులించారు.సకాలంలో స్పందిం చిన 108 సిబ్బందిని వైద్యులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

# వయో వృద్ధుల కోసం అందుబాటులో డే కేర్ సెంటర్

## ప్రారంభోత్సవం చేసిన ప్రభుత్వ సలహాదారు, కలెక్టర్





నిజామాబాద్, జనవరి 21 ( ప్రజా గళం ప్రతినిధి ) వయో వృద్ధుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ దేశంలోనే మరెక్కడా లేనివిధంగా తెలంగాణాలో తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణామ్ కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టిందని, ఇందులో భాగంగా ఆయా జిల్లాలలో వృద్ధుల కోసం డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తోందని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. నిజామాబాద్ నగరంలోని రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో వృద్ధుల కోసం నూతనంగా నెలకొల్పిన డేకేర్ సెంటర్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి బుధవారం లాంచనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో వృద్ధుల సంక్షేమం అత్యంత కీలకమని, వృద్ధులకు ఆరోగ్య సంరక్షణ, మానసిక ఆత్మస్థైర్యం పెంపొందించడం, గౌరవప్రదమైన జీవన విధానం కల్పించాలనే సదాశయంతో ప్రభుత్వం డే కేర్ సెంటర్లను అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. వార్ధక్య దశకు చేరుకున్న తల్లిదండ్రులను పిల్లలు నిర్లక్ష్యం చేయకుండా వారి పట్ల ప్రేమ, ఆప్యాయతలతో వ్యవహరించాలని హితవు పలికారు. ఈ విషయమై ప్రభుత్వం కూడా సానుకూల దృక్పథంతో పలు కీలక నిర్ణయాలను తీసుకుందని, తల్లిదండ్రుల ఆలనాపాలనను పట్టించుకోని ఉద్యోగుల జీతాల నుండి కొంత మొత్తాన్ని తల్లిదండ్రులకు చెల్లిస్తామని ఇటీవలే ఉద్యోగ నియామక పత్రాల అందజేత కార్యక్రమం సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారని గుర్తు చేశారు. వృద్ధులకు ఆరోగ్య సేవలు అందించే వైద్యులు కూడా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, అవసరం మేరకు వారికి ఔషధాలు ప్రిస్క్రైబ్ చేయాలని హితవు పలికారు. కాగా, రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సేవలను ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ప్రశంసిస్తూ, తన కోటా నిధుల నుండి రూ. 15 లక్షల నిధులు మంజూరు చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, వృద్ధులకు మానసిక ఆనందం, సామాజిక అనుబంధం పంచుతూ, అవసరమైన సేవలు అందించడం కోసం ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్ ను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, నిజామాబాద్ జిల్లాను ఆదర్శంగా నిలుపాలని అన్నారు. ఒంటరితనంతో బాధపడే వృద్ధులకు ఈ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వ తోడ్పాటుతో రెడ్‌క్రాస్ ద్వారా ఇలాంటి కార్యక్రమాలు మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా వృద్ధులకు నాణ్యతతో కూడిన బలవర్ధకమైన పౌష్టిక ఆహారం అందించాల్సిన అవసరం ఉంటుందన్నారు. సీనియర్ సిటిజన్లు తాము వృద్ధాప్యంలోకి చేరుకున్నామనే ఆలోచనను విడనాడి, ఆత్మవిశ్వాసంతో, ఆహ్లాదకరంగా జీవనం గడపాలని ఉద్బోధించారు. డే కేర్ సెంటర్ పై అంతస్తులో ఉన్నందున వృద్ధుల సౌకర్యార్థం లిఫ్ట్ ను ఏర్పాటు చేయిస్తామని అన్నారు. డే కేర్ సెంటర్ లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, వయో వృద్ధులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మోహన్ రెడ్డి, డి.సి.సి.బి మాజీ చైర్మన్ కుంటరమేష్ రెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ, రెడ్?క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపే రవీందర్, కార్యదర్శి గోక అరుణ్ బాబు, బోధన్ డివిజన్ చైర్మన్ బసవేశ్వర రావు, ఎం.సి మెంబెర్స్ సూర్య నారాయణ, శ్రీనివాసులు, వెంకట కృష్ణ, హన్మంత్ రావు, వినియోగదారుల ఫోరమ్ అధ్యక్షులు రాజేశ్వర్, సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ ప్రతినిధులు భూమన్న, దయానంద్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు పండరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ మార్పిడితో డయాలసిస్ సమస్య దూరం

## -యశోద ఆసుపత్రి నెఫ్రాలజిస్ట్ డాక్టర్ మామిడి ప్రణీత్ రామ్



నిజామాబాద్ సిటీ, జనవరి 21( ప్రజాగళం ) కిడ్నీ మార్పిడి వలన రోగికి డయాలసిస్ సమస్య శాశ్వతంగా దూరమవుతుందని యశోద ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రణీత్ రామ్ వెల్లడించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని యశోద ఆసుపత్రికి కేర్ సెంటర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన షకీల్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన రెండు కిడ్నీల సమస్యతో 2022 నుండి 2024 వరకు డయాలసిస్ ప్రారంభించిన వ్యక్తిని ప్రాణాపాయం నుండి రక్షించామన్నారు. డయాలసిస్ క్యాథెటర్ ఇన్ఫెక్షన్ల వంటి సవాళ్లని ఏదుర్కోన్నప్పటికీ పట్టుదలతో నిలబడ్డారన్నారు. షకీల్ కు కిడ్నీ మార్పిడికి ముందు చేసిన పరీక్షల్లో గుండె సమస్య బయటపడిందన్నారు. దీనికోసం ఆయనకు కరోనరీ ఆర్టరి స్టెంటింగ్ చేయడం జరిగిందన్నారు.. స్టెంట్ వేసిన ఆరు నెలల తర్వాత ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా మారడంతో కిడ్నీ మార్పిడి విజయవంతంగా జరిగిందన్నారు. కిడ్నీ మార్పిడి ఆవశ్యకత గురించి అతనికి వివరించగా షకీల్ భార్య మనోవర్ ఇర్ఫానా తన కిడ్నీ ఇవ్వడానికి ముందుకు రావడం కీలకమైన మలుపు అని పేర్కొన్నారు. 2024లో కిడ్నీ మార్పిడి జరిగిన తర్వాత ఇప్పుడు ఎవరి సహాయం లేకుండా ఉపాధ్యాయుడిగా తన వృత్తిని, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ సాధారణ జీవితాన్ని గడుపుతున్నారన్నారు. వయస్సు, అనారోగ్య సమస్యల వల్ల కిడ్నీ మార్పిడి పై సందేహాలు ఉన్నవారికి షకీల్ ప్రయాణం గొప్ప స్ఫూర్తి అని కొనియాడారు. సరైన వైద్యం, కుటుంబ సభ్యుల మద్దతు ఉంటే మళ్లీ ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చాన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో యశోద ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ శ్రీరామ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# శభాష్ సర్పంచ్.. భరింగేడిగిలో క్లీన అండ్ గ్రీన్..



బాన్సువాడ,జనవరి 20, ప్రజాగళం.యువకులు, విద్యావంతులు ప్రజాప్రతినిధులుగా బాధ్యత లు చేపడితే గ్రామాల అభివృద్ధి ఎంత వేగంగా సాధ్యమవు తుందో భరింగేడిగి గ్రామ సర్పంచ్ రెంజర్ల అనిల్ కుమార్ నిరూపిస్తున్నారు. బీర్కూర్ మండలంలోని భరింగేడిగి గ్రామంలో సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచే అనిల్ గ్రామ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, శ్రీఅభివృద్ధి పనులను చురుకుగా ముందుకు తీసు కెళ్తున్నారు.ప్రధానంగా గ్రామం లో ఏళ్ల తరబడి ప్రజలను ఇబ్బంది పెట్టిన డ్రైనేజీ సమ స్యను పరిష్కరించాలనే సంక ల్పంతో ఆయన కంకణం కట్టు కున్నారు.పదవి చేపట్టిన వెంటనే పారిశుద్ధ్యంపై దృష్టి సారించి,మురికి కాలువల శుభ్రత, చెత్త తొలగింపు పనులను వేగవంతంచేశారు. ప్రధాన రహదారి దాబా ప్రాం తం నుంచి గ్రామం వరకు రోడ్డు ఇరువైపులా పేరుకు పోయిన ముళ్లపొదలు,చెత్త కుప్పలు తొలగించడంతో పాటు మురుగు కాలువలను శుభ్రం చేయించారు. గ్రామంలో పరిశుభ్రత పెరగడంతో పాటు వర్షాకాలంలో నీటి నిల్వలు, దోమల బెడద తగ్గేలా చర్యలు తీసుకున్నారు. ‘క్లీన్ అండ్ గ్రీన్ భరింగేడిగి’ లక్ష్యంగాగ్రామాన్ని స్వచ్ఛంగా, సుందరంగా తీర్చి దిద్దేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులతో పాటు గ్రామ యువతను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాముల ను చేస్తూ, ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్నారు.పదవిలోకి వచ్చిన కొద్ది కాలం లోనే అభివృద్ధి పనులు కని పించేలా చేపడుతుండటంతో గ్రామస్తులు సర్పంచ్ అనిల్ కుమార్?ను హర్షాతిరేకాలతో అభినందిస్తున్నారు. ప్రజా సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించే తీరుకు మెచ్చుకుంటూ “శభాష్ సర్పంచ్” అంటూ కొనియాడుతున్నారు.యువతకు ఆదర్శంగా నిలుస్తూ, భరింగేడిగిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న అనిల్ కుమార్ భవిష్యత్తులో మరిన్ని ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపడతారని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# బీఆర్ఎస్ పదేళ్ల పాలన పూర్తి అవినీతిమయం

## కేటీఆర్,హరీష్ రావుకు దమ్ముంటే బహిరంగ చర్చకు రండి

## టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



నిజామాబాద్ జనవరి 21 ( ప్రజాగళం ప్రతినిధి) గత బీఆర్ఎస్ పదేళ్ల పాలన పూర్తి దర్యాప్తులు మారిందని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. కేటీఆర్, హరీష్ రావుకు దమ్ముంటే అవినీతిపై బహిరంగ చర్చకు రావాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. నిజామా బాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కేటీఆర్ ,హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై బట్ట కాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.పదేళ్ల బీఆర్ఎస్‌పాలనలో జరిగిన అవకతవకలపై చర్చకు సిద్ధమా అని ఆయన సవాల్ విసిరారు..పసలేని ఆరోపణలు చేసి పారిపోతామంటే కుదరదన్నారు.బీఆర్ఎస్ అవినీతిపై దర్యాప్తులు జరుగుతున్నాయని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అధికారంలోకి వచ్చాక సింగరేణి తో పాటు అనేక సంస్థలను ప్రక్షాళన చేసి సంస్థ బలోపేత మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. బీఆర్ఎస్ నాయకులు గత పదేళ్ల కాలంలో చేసిన తప్పులు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.కేటిఆర్, హరీష్ రావులు చేస్తున్న ఆరోపణలు గత బీఆర్ఎస్ హయంలోనే జరిగాయన్నారు. సింగరేణిలో జరిగిన కాంట్రాక్ట్ లు బీఆర్ఎస్ హయంలోనే జరిగాయని ఆయన అన్నారు..బీఆర్ఎస్ నాయకులు చేసిన తప్పులు కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో భాగంగానే కాంగ్రెస్ పార్టీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలు ఎలా పెంచారని ఆయన ప్రశ్నించారు.మీరు చేసే ప్రతీ ఆరోపణలకు మేము చర్చలకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.దేశంలో టెలిగ్రాఫ్ చట్టంలో ఫోన్ ట్యాపింగ్ అనేది అత్యంత భయంకరమైనదన్నారు.సొంత బీఆర్ఎస్ పార్టీ నాయకులపై సైతం ఫోన్ ట్యాపింగ్ చేసారని విమర్శించారు.ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై ఎలాంటి చర్చకైన సిద్ధంగా ఉన్నామన్నారు.ప్రభుత్వ ఆర్థికాన్ని పెద్ద మొత్తంలో గండి కొట్టారన్నారు.రేపు జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమ న్నారు.దేవుళ్ళ పేరుతో ఓట్లు అడిగే వాళ్ళం కాదని, దేవుళ్ళ పేరుతో రాజకీయం చేసే మీరు ఎలాంటి అభివృద్ధి చేశారని మహేష్ కుమార్ గౌడ్ బీజేపీ నేతలను ప్రశ్నించారు.నిజామాబాద్ జిల్లాకు ఎన్నో అభివృద్ధి పనులు చేసుకుంటున్నామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా విద్య, వైద్యం పై ప్రత్యేక దృష్టి సాధించిందన్నారు.స్వార్థ రాజకీయాల కోసం దేవుళ్ళ పేర్లను వాడుకోవద్దని మహేష్ కుమార్ గౌడ్ హితవు పలికారు.కేంద్రం ప్రకటించిన స్మార్ట్ సిటీ నిజామాబాద్ ను ఎంపీ అరవింద్ ఏం అభివృద్ధి చేశారని ఆయన ప్రశ్నించారు.ఎంపీ అరవింద్ జీవితం కాంగ్రెస్ పార్టీ పెట్టిన బిక్ష అనే ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.ప్యాకేజీలపై ఆధారపడిన జీవితం నాది కాదు అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, గడుగు గంగాధర్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

## కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, జనవరి 21 ( ప్రజా గళం ప్రతినిధి) జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని బుధవారం నిజామాబాద్, ఖమ్మం, వరంగల్, కామారెడ్డి తదితర జిల్లాల కలెక్టర్లలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 729 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వీటి వివరాలను ఇప్పటికే టీ.పోల్ లో నమోదు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల విషయమై వచ్చిన అభ్యంతరాలను నిశితంగా పరిశీలిస్తూ పరిష్కరించడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమిస్తూ, వారికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర సామాగ్రి అందుబాటులో ఉందని, షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా నిఘాను ఉంచేందుకు వీలుగా ఎస్.ఎస్.టీ, ఎఫ్.ఎస్.టీ టీంలను నియమిస్తున్నామని అన్నారు. బ్యాలెట్ బాక్సులు, సామాగ్రి, బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్ కు అవసరమైన ఏర్పాట్లు, నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో తగిన సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులను నియమించేలా ఇప్పటికే సిబ్బందిని గుర్తించడం జరిగిందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్ ల కోసం అవసరమైన ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తెచ్చారు. కాగా, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్నికలను సాఫీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలీలతో 30 సంవత్సరాల బంధం- ఎమ్మెల్యే పోచారం





బాన్సువాడ, జనవరి 21, ప్రజాగళం.బాన్సువాడ పట్టణంలోని పద్మశాలీ కులస్తుల ఆధ్వర్యంలో మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వ్యవసాయ ముఖ్య సలహాదారుడు, బాన్సువాడ నియోజకవర్గం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి పద్మశాలీలతో తమ బంధం ఇప్పటిది కాదని గత 30 సంవత్సరాలుగా కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముందుగా మార్కండేయ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. తాము ప్రతి సంవత్సరం మార్కండేయ జయంతి సందర్భంగా విచ్చేయడం జరుగుతుందని, తనకు మార్కండేయ జయంతికి రావడం అనేది మార్కండేయని ఆశీర్వాదం బలంగా ఉండటమే కారణమని, అదే ఆశీర్వాదంతో పద్మశాలీల ప్రేమ అభిమానంతో కలిసి అడుగులు వేస్తున్నాం కాబట్టి అనుకున్న సాధించగలుగుతున్నామని ఆయన అన్నారు. ప్రస్తుతం కడుతున్న భవనం పద్ధతి ప్రకారం అన్ని సదుపాయాలతో నిర్మించుకోవాలని ఆయన కుల పెద్దలకు సూచించారు. మార్కండేయ జయంతి ఉత్సవాల్లో భాగంగా పద్మశాలి పట్టణ మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఇంటి నుండి మహిళలు కలశాలు తీసుకొని వచ్చి మార్కండేయ మందిరం నుండి పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించి లింగాభిషేకం నిర్వహించిన అనంతరం ధ్వజారోహణ, నూతన వస్త్రాలంకరణ, అన్న పూజ, తీర్థ ప్రసాద వితరణ, పంచామృత అభిషేకం, మార్కండేయ డోలారోహణ, మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కుల పెద్దలు మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్,గూడ శ్రీనివాస్, గుండాల బాలకృష్ణ,జీవన్, నందల రామచందర్,లక్క శ్రీనివాస్, మహిళా సంఘం సభ్యులు అధ్యక్షురాలు ఏర్ల విజయలక్ష్మి, కార్యదర్శి బిజ్జి లత, ఉపాధ్యక్షురాలు సీమ, కోశాధికారి రేఖ పాల్గొన్నారు.

# స్థాయి పెంచినా.. వసతులు అంతంతే!

ధర్మపురి : ధర్మపురి పట్టణంలోని 30 పడకల ఆసుపత్రిని 50 బెడ్లకు ఉన్నతీకరించినా సమస్యలు అదే స్థాయిలో ఉన్నాయి. రోగులకు తాగునీరు, సరైన భోజన వసతులు కరవయ్యాయి. రోగుల తాకిడి విపరీతంగా పెరిగినా అసౌకర్యాలతోనే నెట్టుకొస్తున్నారు. ప్రతిరోజు ధర్మపురి క్లస్టర్? దవాఖానాకు ధర్మపురి, బుగ్గారం, బీర్?పూర్, వెల్గటూర్, పొరుగున ఉన్న మంచిర్యాల జిల్లాలోని లక్సెట్టిపేట ప్రాంతం నుంచి 150 మంది రోగులు వైద్య పరీక్షలు, చికిత్సలు, ప్రసూతి సేవలకు వస్తుంటారు. వైద్య సిబ్బంది, పరికరాల కొరతతో అత్యవసరమైతే జగిత్యాల ఆస్పత్రికి పంపిస్తున్నారు.

**ఐసీయూ వార్డు ప్రారంభమెప్పుడు?**

ఆసుపత్రి స్థాయిని గతంలోనే అప్‌గ్రేడ్ చేయగా.. వైద్యులు, సిబ్బందిని కేటాయించటం లేదు. దీంతో పలువురు రోగులు అత్యవసర చికిత్సలకు జగిత్యాల, కరీంనగర్? వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే అన్ని రకాల వైద్య పరికరాలు సరఫరా చేసి, ఐసీయూ నిపుణులు, టెక్నీషియన్లు, సిబ్బందిని నియమించాలి. రెండో అంతస్తులో గదులు నిర్మించగా.. పరికరాలు, వైద్య



సిబ్బంది కొరతతో మొక్కుబడి సేవలకే పరిమితమవుతోంది. పది బెడ్లతో ఐసీయూ కేంద్రం ఏర్పాటు చేయగా.. వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని నియమించకపోవటంతో ప్రారంభానికి నోచటం లేదు.

**అసౌకర్యాలు ఇవీ..**

విద్యుత్తు సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. జనరేటర్ ఏర్పాటు చేస్తే ఇబ్బంది ఉండదు.

తాగునీటి వసతికి ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలి.

స్కానింగ్ యంత్రాలు, రోగ నిర్ధారణ పరికరాలు, ఎక్స్‌రే ప్లాంట్ తదితరాలు లేవు. ఆసుపత్రిలో మందులు కూడా అరకొరగానే లభిస్తున్నాయి.

నాలుగు ల్యాబ్‌లు అవసరం కాగా ఒక్కటే అందుబాటులో ఉంది.

**ప్రతిపాదనలు పంపాం..**సిబ్బంది, పరికరాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఆస్పత్రిలో అన్ని రకాల సేవలందిస్తున్నాం. నిత్యం 150-200 ఓపీ నమోదవుతోంది. ప్రస్తుతం రెండో అంతస్తును కూడా పూర్తిగా అందుబాటులోకి తీసుకొస్తాం. ఉదయం నుంచి రాత్రి వరకు వైద్యులు ఉంటున్నారు.

డా.రవి, ఆసుపత్రి సూపరింటెండెంట్

# రాజన్న కోడెలు అలసిపోతున్నయ్?..

వేములవాడ : వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం కోడె మొక్కులకు ప్రసిద్ధి. దేశంలో ఎక్కడా లేని విధంగా కోడె మొక్కులు ఈ ఆలయంలోనే భక్తులు చెల్లించుకునే ఆచారం అనాది నుంచి వస్తోంది. కోరిన కోర్కెలు తీరితే స్వామివారికి భక్తులు కుటుంబ సమేతంగా కోడె మొక్కు చెల్లిస్తుంటారు. అలాంటి భక్తుల మొక్కులు తీర్చే కోడెలు అలసి పోతున్నాయి. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు మొదలు కావడంతో కోడె మొక్కులతో పాటు వివిధ ఆర్జిత సేవల మొక్కులు అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో చెల్లించుకుంటున్నారు. సమ్మక్క జాతరకు వెళ్లే భక్తులు ముందుగా రాజన్నకు మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా ఉండటంతో గత నెల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు.

**సోమవారం 10 వేలకుపైగా కోడె టికెట్లు**

ఒక్కో సోమవారం లక్ష మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఇందులో దాదాపు పది వేల మందికిపైగా భక్తులు రికార్డు స్థాయిలో కోడె మొక్కులు చెల్లించుకుంటున్నారు. మిగతా రోజుల్లో 40 వేల నుంచి 80 వేల మంది వరకు భక్తులు స్వామివారి దర్శించుకోగా దాదాపు 8 వేల వరకు కోడె మొక్కులు చెల్లించుకుంటున్నారు. దీంతో కోడెలకు విశ్రాంతి లభించని పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది.**నిరంతరాయంగా అయిదు గంటలు**

భక్తులు మొక్కులు చెల్లించుకునే కోడెలు.. గోశాలలో 170 వరకు ఉంటాయి. భక్తుల రద్దీని బట్టి 20 నుంచి 50 కోడెల వరకు ఆలయానికి సిబ్బంది తీసుకువస్తుంటారు. ఈ కోడెలు నిరంతరాయంగా దాదాపు అయిదు గంటల పాటు విధులు నిర్వహిస్తుంటాయి. ఉదయం 5 గంటలకు కోడె మొక్కులు మొదలవుతాయి. నాలుగు షిఫ్టుల్లో ఈ కోడెలను నిరంతరాయంగా మొక్కులు చెల్లించుకునే భక్తులు ఆలయం



చుట్టూ తిప్పుతుంటారు. ప్రస్తుతం కోడె మొక్కులు చెల్లించుకునే భక్తుల సంఖ్య భారీగా పెరిగిపోవడంతో అవి తీవ్రంగా అలసిపోతున్నాయి. దీంతో కొన్ని సందర్భాల్లో కోడెలు ఆలయం చుట్టూ తిరగడానికి వెళ్లడం లేదు. దీంతో వాటిని భక్తులు తాడుతో బలంగా లాగడంతో అవి అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందనే అభిప్రాయం భక్తుల్లో వ్యక్తం అవుతోంది.

**దూరం పెరిగి..**

ముఖ్యంగా రాజన్న ఆలయం చిన్నగా ఉండటంతో తిరిగే సమయం తక్కువగా ఉండేది. దీనికి తోడు గోశాల కూడా సమీపంలోనే ఉండటంతో దూరం తక్కువగా ఉండేది. ప్రస్తుతం భీమన్న ఆలయం పెద్దగా ఉండటంతో ఎక్కువ సేపు తిరగాల్సి వస్తోంది. దీనికి తోడు షిఫ్ట్‌ల తరువాత గోశాల వెళ్లడంతో దూరం పెరిగిపోయింది. వీటన్నింటికి తోడు భారీ సంఖ్యలో కోడె మొక్కుల టికెట్లు విక్రయం అవుతున్నాయి. దీంతో కోడెలకు అసలు ఏమాత్రం విశ్రాంతి లభించని పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది.**కోడెల సంఖ్య పెంచేందుకు చర్యలు**

రాజన్న ఆలయంలో కోడెలు తిరిగే స్థలం తక్కువగా ఉండేది. భీమన్న ఆలయంలో ఎక్కువ సేపు తిరగడంలో అలసిపోతున్నాయి. తిరిగే సమయాన్ని తగ్గించేందుకు మరో 50 కోడెలను సిద్ధం చేస్తున్నాం. గోశాలలో అదనంగా కోడెలకు షెడ్లు ఏర్పాటుకు ప్రణాళికా సిద్ధమైంది.

బి.శ్రీనివాస్, రాజన్న ఆలయ ఏఈవో

# పావుకేజీ మించడం లేదు



హైదరాబాద్: ఇళ్లల్లో వంట చేసుకోవడం తగ్గడం.. వారానికి రెండు, మూడు రోజులు రెస్టారెంట్లలో తినడం.. జంక్‌ఫుడ్స్‌కు ప్రాధాన్యం వల్ల ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల వినియోగం తగ్గుతోంది. నగరంలో చాలామంది రోజుకు 250 గ్రాములకు మించి ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు లాంటివి తినడం లేదని నిపుణులు చెబుతున్నారు. అది కూడా రోజూ ఏదో ఒక రకం పండు లేదంటే ఆకుకూరకు పరిమితమవుతున్నారు. రోజూ 250 గ్రాములు ఆకుకూరలు, కూరగాయలుంటే మరో 150 గ్రాముల వరకు పండ్ల శాతం ఉండాలంటున్నారు.

**ఎన్నో ప్రయోజనాలు..**

స్వీట్లు, బేకరీ ఇతర జంక్‌ఫుడ్స్‌లో క్యాలరీలు, కొవ్వులు అధికంగా ఉంటాయి. పండ్లు, కూరల్లో తక్కువ. వీటిలో మేలు చేసే విటమిన్లు, పోషకాలు, ఫోలిక్? యాసిడ్, సూక్ష్మ పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. పండ్లు, ఆకుకూరలు, కూరగాయల్లో పీచు ఎక్కువ. పండ్లలోని సాల్యుబుల్ పీచు వల్ల రక్తంలో కొలెస్ట్రాల్ పెరగకుండా చూస్తాయి. పీచు ఆలస్యంగా జీర్ణం అవుతుంది. కడుపు నిండుగా ఉన్న భావనతో చిరుతిళ్ల జోలికి పోరు. ఫలితంగా ఊబకాయం రాదు.పండ్లు, ఆకుకూరల్లో ఉన్న పీచు వల్ల మలబద్ధకం దరిచేరదు. మధుమేహం నియంత్రణలో ఉంటుంది. పండ్లు, కూరల్లో పొటాషియం వల్ల అధిక రక్తపోటు సమస్య తగ్గుతుంది.

వీటిలోని యాంటి ఆక్సిడెంట్లు శరీరంలోని కణజాలాన్ని ఉత్తేజితం చేస్తాయి. జుట్టు రాలటం, చర్మం ముడతలు, వృద్ధాప్య సమస్యలను తగ్గిస్తాయి. గ్యాస్ట్రిక్ క్యాన్సర్లకు అడ్డుకట్ట వేస్తాయి.

**అనేక జబ్బులకు అడ్డుకట్ట: డా:లక్ష్మయ్య**

మాజీ శాస్త్రవేత్త, జాతీయ పోషకాహార సంస్థ

నగరంలో జంక్‌ఫుడ్స్ వినియోగం పెరిగి చాలామంది పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవడం లేదు. వివిధ అనారోగ్య సమస్యలకు ఆహారపుటలవాట్లే కారణం. పండ్లు, ఆకుకూరలు విరివిగా తీసుకుంటే పేగుల్లో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. జబ్బులకు అడ్డుకట్ట వేయవచ్చు. నిత్యం పెద్దలు 400 గ్రాములు, 18 ఏళ్లలోపు పిల్లలు 250 గ్రాముల పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు ఆహారంలో మిళితం చేసుకోవాలి.

# ధర ఎక్కువ.. తూకం తక్కువ



హైదరాబాద్: కొనుగోలుదారులకు అందుబాటు ధరల్లో.. తాజా కూరగాయల విక్రయాలకు ఉద్దేశించిన రైతుబజార్లు గాడి తప్పాయి. నిర్వహణ కొరవడి అధ్వానంగా మారుతున్నాయి. సౌకర్యాల కొరత, పారిశుద్ధ్య లోపం, నిర్దేశించిన ధరలకంటే ఎక్కువకు విక్రయాలు, తూకాల్లో మోసాలు, రైతుబజార్లలో వ్యాపారుల హవా పెరుగుతోంది. ఎర్రగడ్డ, మెహిదీపట్నం, కేపీహెచ్‌బీ, వనస్థలిపురం రైతుబజార్లకు ఆదరణ ఉన్నా సమస్యలు అదే స్థాయిలో ఉన్నాయి.

**ఎర్రగడ్డలో..**

ఎర్రగడ్డ రైతుబజారులో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. బీరకాయ కిలో రూ.38 అని బోర్డులో ఉంటే రూ.55కు విక్రయిస్తున్నారు. నిత్యం బోయిన్‌పల్లి మార్కెట్ ఆధారంగా నిర్ణయించే ధరలు ఉదయం 10 గంటలకు వస్తాయి. కొత్త ధరలు రాలేదంటూ పెంచి విక్రయిస్తున్నారు. చాలా స్టాళ్లను వ్యాపారులే నడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

**సంచార రైతుబజార్లలో..**

సంచార రైతుబజార్ల ముసుగులో వినియోగదారులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. వాస్తవానికి రైతుబజారులో ధరపై కిలోకు రూ.5 పెంచి సంచార రైతుబజార్లలో విక్రయించాలి. కానీ రూ.15 వరకు వసూలు చేస్తున్నారు.

**నిత్యం 6 వేల మంది**

మెహిదీపట్నం రైతుబజార్‌కు నిత్యం ఆరు వేల మంది కొనుగోలుదారులు వస్తుంటారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారాయి. తాగునీటి ఏటీఎం, ఆర్వో ప్లాంట్? పనిచేయడం లేదు. షెడ్లు సరిపోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

**కూకట్‌పల్లిలో పైకెక్కాలంటే..**

కూకట్‌పల్లి రైతుబజారు ప్రాంగణం వ్యర్థాలతో అధ్వానంగా మారింది. లిఫ్ట్ పనిచేయక పైఅంతస్తులో 40 కూరగాయల దుకాణాలు ఉండడంతో అక్కడకు వెళ్లేందుకు వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. తూకాల్లో తేడాలు ఉంటున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. సెల్లార్ పార్కింగ్ దారిలో అక్రమంగా దుకాణాల ఏర్పాటుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

**25 ఏళ్లయినా రేకుల షెడ్డే గతి**

వనస్థలిపురంలో 25 ఏళ్ల కిందట ఆరు రేకుల షెడ్లలో రైతుబజారును ఏర్పాటు చేశారు. ఇప్పటికీ అందులోనే కొనసాగుతోంది. రైతుబజారు ముందు పార్కింగ్‌తో ఇబ్బందులు తప్పడం లేదు. మరుగుదొడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. బోర్డు ధరల కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారని నిత్యం ఫిర్యాదులు వస్తున్నాయి.

# కాలిబాటలతో బహుళ ప్రయోజనం



హైదరాబాద్ : హైదర్‌గూడలో నాలుగో తరగతి చదివే విద్యార్థి నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్నాడు. కొంతదూరం వెళ్లాక రహదారి పొంగిన డ్రైనేజీతో నిండిపోయింది. కాలు పెట్టే వీల్లేక ఇంటికెళ్లి తండ్రికి చెప్పడంతో అతన్ని బైకుపై తీసుకెళ్లి దిగబెట్టాడు. కాలిబాటలు సక్రమంగా ఉంటే ద్విచక్రవాహన ట్రిప్పులు తగ్గించొచ్చు అనేందుకు ఈ ఉదాహరణే నిదర్శనం.

కాలుష్యంతో నగరాలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. అందులో వాహన కాలుష్యమే ఎక్కువ ముప్పు. ప్రజారవాణా తగ్గి వ్యక్తిగత వాహనాలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని పర్యావరణవేత్తలు అంటున్నారు. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా ప్రజారవాణాను విస్తరించకపోవడం, ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ సదుపాయాలను కల్పించకపోవడంతో సొంత వాహనాల వైపు ప్రయాణికులు మొగ్గు చూపుతున్నారు. కాలిబాటలను పక్కాగా ఏర్పాటు చేస్తే ప్రజారవాణా గణనీయంగా పెరిగి.. తద్వారా వాహన కాలుష్యమూ తగ్గుతుంది.

**ప్రజా రవాణా వాటా పెరగా..**

హెచ్?ఎండీఏ పరిధిలో రోజువారీ ప్రయాణంలో ప్రజారవాణా 2011లో 42 శాతం ఉండగా 2025 నాటికి 28 శాతానికి పడిపోయిందని లీ అసోసియేట్స్? కాంప్రహెన్సివ్? మొబిలిటీ ప్లాన్? (సీఎంపీ) నివేదికలో వెల్లడించింది. 45 శాతం మంది రోజువారీ అవసరాల కోసం ద్విచక్రవాహనం వినియోగిస్తున్నారు. వీరు 69.2 లక్షలు ట్రిప్పులు రోజూ తిరుగుతున్నారు. కార్లలో తిరిగేవారు 16 శాతం. కార్లు 24.3 లక్షల ట్రిప్పులు తిరుగుతున్నాయి. వీరిని ప్రజారవాణా వైపు మళ్లించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ప్రస్తుత ప్రజా రవాణా వాటాను 70 శాతానికి తీసుకెళ్లాలనుకుంటోంది.

**మెట్రో, బస్సుల వరకు...**

బస్టాప్, మెట్రోరైలు స్టేషన్లకు చేరుకునేందుకు నడక ప్రమాదమని చాలామంది వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీన్ని సురక్షితంగా మారిస్తే వాహన రద్దీ, కాలుష్యం తగ్గుతుంది.

**అక్కడ చాలా సురక్షితం..** పాదచారులకు అత్యంత సురక్షితమైన నగరాల్లో పారిస్, బార్సిలోనా ముందుంటాయి. నడిచి వెళ్తూ రోజువారీ అవసరాలు తీరేలా డిజైన్? చేశారు. 15 నిమిషాల దూరంలోనే అన్ని లభించేలా దృష్టి పెట్టారు. తెలంగాణ ప్రభుత్వం ఇదేవిధంగా టీవోడీ ఆధారిత రవాణా సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టబోతున్నట్లు విజన్? 2047 డాక్యుమెంట్?లో ప్రకటించింది.

సింగపూర్?లో సైతం కాలిబాటలకు ప్రాధాన్యం ఉంటుంది. నడకను సులభతరం చేయడమే కాదు సురక్షితం అంటారు.

మనదేశంలో చండీగఢ్, చెన్నై, కోల్‌కతాలో కొంత భాగం వరకు నడక మార్గాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

# ఈ-పంచాయతీల్లో వేతన వెతలు

జమ్మికుంట : గ్రామ పంచాయతీల్లో ధ్రువపత్రాలు, పంచాయతీల ఆదాయం, పన్నుల వసూళ్లు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వివరాలు, గృహ నిర్మాణాలకు సంబంధించిన పత్రాలు, ఎన్నికల సమయంలో నామపత్రాల స్వీకరణ నుంచి ఫలితాలు వచ్చేదాకా కంప్యూటర్ ఆపరేటర్లు విధులు నిర్వహిస్తూ అంతర్జాలంలో పొందుపరుస్తుంటారు. ప్రభుత్వానికి సంబంధించిన పలు సర్వే రిపోర్టుల వివరాలు, ఇలా ప్రతి అంశంలోనూ ఈ-పంచాయతీ ఆపరేటర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. మండల ప్రజా పరిషత్తు కార్యాలయాలు, పంచాయతీ క్లసర్? కేంద్రాల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా అవసరాన్ని బట్టి ఉదయం, రాత్రి సమయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే వారికి వేతనం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

**190 మంది నిరీక్షణ**



నాలుగు మాసాలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆపరేటర్లకు ఇస్తున్న వేతనంలో గతేడాది నుంచి రూ.3,250 కోత విధించడంతో ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 190 మంది విధులు నిర్వహిస్తున్నారు. గతేడాది డిసెంబరు దాకా రూ.22,750 దాకా వేతనం రాగా.. జనవరి నుంచి వేతనాల్లో కోత విధించి రూ.19,500 ఇస్తున్నారు. అది కూడా రెండు లేదా మూడు మాసాలకోసారి ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది అక్టోబరు నుంచి నేటి దాకా వేతనాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నామని వాపోతున్నారు.

**పెరిగిన పనిభారం**

పంచాయతీలకు సంబంధించిన పూర్తి వివరాలను కంప్యూటర్లలో నమోదు చేయడం, ధ్రువపత్రాల జారీ నుంచి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన దరఖాస్తుల నమోదు ఇలా ప్రతి పనిలోనూ పనిభారం పెరుగుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో మండలానికి ఇద్దరు నుంచి ముగ్గురు దాకా విధులు నిర్వహిస్తున్నారు.

**పోషణకు అప్పులు**

ప్రతినెల వేతనాలు ఇవ్వకపోవడంతో ఆపరేటర్లు ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబాలను పోషించేందుకు అప్పులు చేస్తున్నాం. గతంలో ఇచ్చినట్లు వేతనాన్ని రూ.22,750 చొప్పున ఇవ్వాలి. పని భారం పెరుగుతుంటే వేతనాలను తగ్గించడం తగదు. ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఆపరేటర్లకు రూ.15 వేల పారితోషికం ఇవ్వాలి.

అంజి, అధ్యక్షులు, ఈ-పంచాయతీ ఆపరేటర్ల సంఘం, కరీంనగర్ జిల్లా **ఉమ్మడి జిల్లాలో ఈ-పంచాయతీ ఆపరేటర్ల వివరాలు**


జగిత్యాల 63 కరీంనగర్ 52 పెద్దపల్లి 39 రాజన్న సిరిసిల్ల 36

# వేసవి ప్రణాళిక.. సమస్యలు ఉండవిక

భగత్‌నగర్ : వేసవి అనగానే వినియోగదారులకే కాదు విద్యుత్తు అధికారులకూ ముచ్చెమటలు పడతాయి. బోరుబావులపై వ్యవసాయం సాగుతుంది. ఇదే సమయంలో వేసవి తాపం నుంచి రక్షించుకోవడానికి ప్రజలు ఎయిర్ కండిషనర్లు, కూలర్లు, ఫ్యాన్లు విరివిగా ఉపయోగిస్తారు. విద్యుత్తు వినియోగం పెరిగి నియంత్రికలపై, లైన్లపై భారం అధికమవుతుంది. పెరిగిన భారాన్ని తట్టుకోలేక నియంత్రికలు కాలిపోవటం.. లైన్లలో బ్రేక్ డౌన్లు తదితర సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతాయి. పదేపదే కరెంటు సరఫరా నిలిచిపోతుంది. ఇలా జరగకుండా విద్యుత్తు సంస్థ వేసవి ప్రణాళిక చేపడుతుంది.

**భారం పడకుండా..**

విద్యుత్తు పంపిణీలో కీలకం నియంత్రికలు.. ఇళ్లకైనా వ్యవసాయ బావులకైనా వాటి సామర్థ్యంపైనే కరెంటు పంపిణీ వ్యవస్థ ఆధారపడి ఉంటుంది. సామర్థ్యానికి మించి భారం ఉంటే నియంత్రికాలు కాలిపోతాయి. దీన్ని ముందస్తుగా గుర్తించి దాని సామర్థ్యం మించిన నియంత్రిక ఏర్పాటు చేయాలి. క్షేత్రస్థాయిలో టాంగ్ టెస్టర్‌తో నియంత్రికల్లోని ఫీడర్లపైన ఉన్న భారం (లోడ్?) కొలిచి అవసరమైన చోట సామర్థ్యం పెంచారు. అవసరమైన ప్రదేశాల్లో కొత్తవి ఏర్పాటు చేశారు. గతేడాది 693 నియంత్రికల ఏర్పాటు చేశారు. రాబోయే వేసవిలో 136 నియంత్రికల ఏర్పాటుకు ప్రణాళిక తయారు చేశారు.



**విద్యుత్తు ఉపకేంద్రాల అనుసంధానం**

ఒక విద్యుత్తు ఉపకేంద్రంలో సాంకేతిక సమస్య తలెత్తితే మరో ఉపకేంద్రం నుంచి ప్రత్యామ్నాయ మార్గంలో కరెంటు సరఫరా చేసే విధంగా లైన్లను అనుసంధానం చేస్తున్నారు. జిల్లాలో 97 విద్యుత్తు ఉపకేంద్రాలు 33/11కేవీ ఉంటే అందులో 23 విద్యుత్తు ఉపకేంద్రాలకు ప్రత్యామ్నాయ మార్గంలో విద్యుత్తు సరఫరా చేసేలా 23 కొత్త 33 కేవీ లైన్లు నిర్మించారు. వేసవి నాటికి 11 కొత్త లెన్లు నిర్మించడానికి సిద్ధమవుతున్నారు.

**సామర్థ్యం పెంపు**

ఒక ప్రాంతంలోని ఉపకేంద్రంలో కరెంటు సరఫరా నిలిచిపోతే మరో ఉపకేంద్రం నుంచి విద్యుత్తు సరఫరా చేయాలంటే అందులోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచాలి. ఇలా జిల్లాలో 17 పవర్? ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచారు.

# చేనేతకు తెలంగాణ లేబుల్

చౌటుప్పల్ : చేనేత వస్త్రాలకు నకిలీల నుంచి రక్షణ కల్పించేందుకు 'తెలంగాణ హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ లేబుల్'ను ప్రవేశ పెడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఏడాది కావొస్తున్నా.. ఈ లేబుళ్లు చేనేత కార్మికుల చేతికి అందడం లేదు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని చేనేత కళాకారులు మగ్గాలపై నేసే పోచంపల్లి పట్టుచీర, పుట్టపాక తేలియా రుమాల్ వస్త్రాలకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్(జీఐ) లభించింది. ఒక ఉత్పత్తికి దాని భౌగోళిక మూలం, నాణ్యత, ఖ్యాతి, ప్రత్యేక లక్షణాలను మదింపు చేసి ఈ ట్యాగ్‌ను పేటెంట్స్, డిజైన్స్ అండ్ ట్రేడ్‌మార్క్స్ కంట్రోలర్ జనరల్ జారీ చేశారు. వీటితోపాటు రాష్ట్రంలోని గద్వాల, నారాయణపేట, సిద్దిపేట గొల్లభామ చీరలు, వరంగల్ దర్రీలకు జీఐ ట్యాగ్ లభించింది.

ట్యాగ్‌తో ఈ వస్త్రాలకు నకిలీలు తయారు చేయకుండా రక్షణ లభిస్తుందని, ఉపాధి పెరుగుతుందని చేనేత కార్మికులు భావించారు. చేనేత వస్త్రాలకు నకిలీలతో కార్మికుల ఉపాధికి కోత పడింది. విజిలెన్స్? బృందాల తనిఖీల్లో చేనేత వస్త్రాలకు నకిలీలను గుర్తించినా చర్యలు మాత్రం శూన్యం. మగ్గాలపై నేసిన అసలైన చేనేత వస్త్రాలపై లేబుళ్లను అతికిస్తే తెలంగాణలో తయారైన వాటికి గౌరవం, నమ్మకం, అమ్మకం



పెరుగుతాయని ప్రభుత్వం ప్రకటించింది. వాటికోసం చేనేత కార్మికులు ఎదురుచూస్తున్నారు.

**లేబుళ్లను సరఫరా చేస్తాం**

అన్నదేవర శ్రీనివాసరావు, ఏడీ, చేనేత-జౌళి శాఖ, యాదాద్రి జిల్లా

నేతన్నకు భరోసా పథకంలో మగ్గానికి జియోట్యాగ్ చేయించుకుని, మాతో ఒప్పందం చేసుకున్న 6771 చేనేత కుటుంబాలకు బార్? కోడ్‌తో లేబుల్స్ ఫిబ్రవరిలో ఇస్తాం. మగ్గంపై నేసిన వస్త్రాలపై ఆ లేబుల్? అతికించుకోవాలి. ఫొటో తీసి మాకు పంపాలి. లేబుల్‌ను స్కాన్ చేస్తే ఆ వస్త్రాన్ని మగ్గంపై నేసిన కార్మికుడి పేరు, అతని ఫొటో, గ్రామం, జిల్లా వివరాలు కనిపిస్తాయి. ఆ వస్త్రం పొడవు, వెడల్పు, దాని తయారీకి ఉపయోగించిన నిలువు, పేక దారం, దాని నాణ్యత వివరాలన్నీ పొందుపర్చి ఉంటాయి. లేబుల్ ఉన్న వస్త్రాలనే కొనుగోలు చేయాలని ప్రభుత్వం ప్రచారం కూడా చేస్తుంది. ఒక్కో చేనేత కార్మికుడికి ఏడాదికి 28 నుంచి 56 చీరలు మగ్గాలపై నేసేలా ఒప్పందం చేసుకుని, ఆ సంఖ్య ప్రకారమే లేబుళ్లు సరఫరా చేస్తాం. లేబుళ్లు ఉంటేనే అసలైన చేనేత వస్త్రాలని వినియోగదారులకు నమ్మకం కుదురుతుంది.

# అనుకున్న దానికంటే ముందుగా.. అందుకు పరిహారంగా

హుజూర్‌నగర్ : వ్యవసాయ కళాశాల కోసం భూమిని అనుకున్న గడువు కంటే ముందుగానే ప్రభుత్వం సేకరిస్తోంది. హుజూర్?నగర్? పట్టణ సమీపం మగ్దుంనగర్ ప్రాంతంలో 100 ఎకరాలు సేకరణకు భూమిని ఎంపిక చేశారు. ఆ భూమిని రబీ పంట తర్వాత స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర గవర్నర్? జిష్ణుదేవ్‌వర్మ ఈ నెల 20న మట్టపల్లి లక్ష్మినరసింహస్వామిని దర్శించుకునేందుకు వస్తుండటంతో వ్యవసాయ కళాశాల భవనానికి శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు. ఆయన శంకుస్థాపనకు వస్తున్న సందర్భం గా భూసేకరణ కూడా ముందుగానే చేయాలని నిర్ణయించారు. కానీ ఇప్పటికే రైతులు ఆ వంద ఎకరాల్లో వరి వేశారు. అనుకున్న ప్రణాళిక ప్రకారం రబీ పంట చేతికందిన తరువాత భూమిని వ్యవసాయ కళాశాలకు అప్పగించాల్సి ఉంది. గవర్నర్? పర్యటన ఖరారు కావటం తో ప్రభుత్వం ముందుగానే భూ సేకరణ చేసేందుకు నిర్ణయించింది. రబీ పంటకు నష్టపరిహారం చెల్లింపు కూడా ప్రారంభించింది.రైతులకు నష్టపరిహారం చెల్లింపులు కూడా రెండు రోజులు నుంచి జరుగుతు



న్నాయి. ముందుగా అనుకున్న దాని ప్రకారం కళాశాల కోసం భూమిని కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.24 లక్షలు ఇవ్వాలని నిర్ణయించారు. కానీ రబీ సీజన్ తర్వాత భూమిని అప్పగించేలా అనుకున్నారు. ముందుగా భూమిని సేకరణ చేస్తున్న దృష్ట్యా రైతులు వేసిన పంటకూ నష్టపరిహారం చెల్లించాలని.. ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రస్తుతం ఎకరాకు రూ.24.50 లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

**మరికొంత సేకరణకు ఏర్పాట్లు**1041 సర్వే నెంబర్‌లో ఉన్న భూమిలో మరో 138 ఎకరాలు కూడా ఫుడ్‌కోర్టు పేరుతో సేకరణ చేయనున్నారు. వ్యవసాయ కళాశాల విత్తన ఉత్పత్తి, ప్రయోగ పంటలు, రైతులకు శిక్షణ కోసం చేసే సేద్యానికి మరికొంత భూమిని సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

# కొత్తవారికి అవకాశం ఎప్పుడో..!

భానుపురి : గృహజ్యోతి పథకం జిల్లాలోని పేద, మధ్య తరగతికి చెందిన 1,86,962 కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. జిల్లాలో గత ఏడాది మార్చి నుంచి అర్హులైన లబ్ధిదారులకు ప్రతి నెలా జీరో బిల్లు జారీ అవుతోంది. ప్రభుత్వం 2023 డిసెంబరు 28 నుంచి 2024, జనవరి 6 వరకు చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో గృహ జ్యోతి దరఖాస్తులు స్వీకరించింది.

**వినియోగం ఇలా**200 యూనిట్లకు ఒక యూనిట్ అదనంగా వాడినా బిల్లు కట్టాల్సిందే. ఈ భారం పడకుండా పేదలు, మధ్య తరగతి ప్రజలు పొదుపుగా విద్యుత్తును వినియోగిస్తున్నారు. తక్కువ కరెంటు వినియోగం అవుతుందనే ఉద్దేశంతో అనేక మంది ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల వినియోగానికి మొగ్గు చూపుతున్నారు. గృహోపకరణాలను అతి జాగ్రత్తగా వాడుతున్నారు. గృహజ్యోతి అమల్లోకి వచ్చాక తక్కువ విద్యుత్తు బిల్లు వచ్చేందుకు 5 స్టార్? రేటింగ్? ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేస్తున్నారు.

**తప్పని ఎదురుచూపులు**గృహజ్యోతి ప్రారంభమైనప్పుడు దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి ఈ పథకం వర్తించలేదు. దీంతో గ్రామీణులు ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణవాసులు పుర కార్యాలయాల్లో మరోమారు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసింది. గృహజ్యోతి పథకం వర్తింపునకు ప్రభుత్వం తమకు అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.ఇప్పటి వరకు ఎటువంటి ఆదేశాలు రాలేదని.. వచ్చిన వెంటనే కొత్తవారికి కూడా గృహజ్యోతి పథకం వర్తించేలా చూస్తామని విద్యుత్తుశాఖ ఇన్‌ఛార్జి ఎస్ఈ శ్రీనివాస్ తెలిపారు.

# పుష్కర వేడుక.. కుంభమేళాను తలపించేలా



ధర్మపురి : రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా వనాల పెంపు, వసతుల కల్పన, వాహన పార్కింగ్ తదితర సౌకర్యాలపై రాష్ట్ర ప్రభుత్వం విభాగాల వారీగా కసరత్తు ప్రారంభించింది. జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి నుంచి గోదావరిఖని వరకు విస్తరించిన గోదావరి నదిపై ఎక్కడెక్కడ పుష్కరాలు నిర్వహించే అవకాశముంది ఎక్కడెక్కడ ప్రధాన కేంద్రాలున్నాయి? ఏమేం ఏర్పాట్లు చేయాలనే దానిపై సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దేవాదాయ శాఖ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, తదితర విభాగాల నుంచి చేపట్టాల్సిన పనులు, అంచనాలను సమగ్ర సర్వే చేసి ప్రభుత్వానికి సమర్పించారు. ధర్మపురికి మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని భావిస్తున్నారు. రహదారులు, పుష్కరఘాట్ల మరమ్మతు, తాగునీటి వసతులు, పార్కింగ్ సమస్యలపై ఇటీవల రాష్ట్ర స్థాయిలో అధికారులు చర్చించారు.

**ప్రయాగ్‌రాజ్ పాఠం నేర్వాలి**

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మియావాకి విధానం ద్వారా రూ.18.50 ఎకరాల్లో 63 రకాలకు చెందిన కోట్ల మొక్కలను పెంచారు. ఇవి రెండేళ్లలో చెట్లుగా ఎదిగి స్వచ్ఛమైన గాలిని అందిస్తున్నాయి. గతేడాది మహాకుంభమేళా జరిగింది. కోట్ల మంది వచ్చినా ఎలాంటి శ్వాసకోశ వ్యాధులు ప్రబలకుండా పరిరక్షించినట్లయింది. ఇలాంటి ముందస్తు చర్యలు రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా చేయాలని నిపుణులు పేర్కొంటున్నారు. దీనిపై హైదరాబాద్? నుంచి రాష్ట్ర దేవాదాయశాఖ ఉన్నతాధికారుల బృందం ప్రయాగ్‌రాజ్ తరలివెళ్లి పన్నెండు రోజులపాటు అక్కడే ఉండి పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలోని ధర్మపురి, కోటిలింగాల, మంథని క్షేత్రాల్లో రానున్న పుష్కరాల సందర్భంగా వసతుల కల్పనపై ప్రభుత్వానికి నివేదికలను పంపారు.

**దాదాపు కోటిమంది..**వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలకు సుమారు కోటిమంది వరకు భక్తులు ధర్మపురికి వస్తారని అంచనా వేసి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఆ దిశగా ముందుకు వెళుతున్నారు. ధర్మపురి గోదావరి నది చుట్టూ పచ్చదనం విరిసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. మామూలు వృక్షాలకంటే కూడా మియావాకీ విధానంతో సమగ్ర ప్రణాళికలను రూపొందించాల్సి ఉందని నిపుణులు చర్చిస్తున్నారు. గతనెలలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచనల మేరకు పర్యాటక, దేవాదాయశాఖ ప్రతినిధుల బృందం ప్రాథమిక స్థాయిలో పరిశీలించారు. ఇటీవల అన్ని విభాగాలతో చేపట్టాల్సిన అంశాలపై సర్వేలు చేసి ప్రతిపాదించారు. నిధుల విషయంలో ఇంకా స్పష్టత రాలేదు.

# 6 కేంద్రాలు.. 700 బస్సులు



కరీంనగర్ : రెండేళ్లకోసారి జరిగే మేడారం జాతరకు నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తజనం తరలివెళ్తారు. ఈ క్రమంలో ఆర్టీసీ భక్తుల సౌకర్యార్థం మేడారానికి ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈనెల చివరి వారంలో జరిగే జాతరకు కరీంనగర్ రీజియన్ నుంచి ప్రత్యేక సర్వీసులు నడపాలని అధికారులు నిర్ణయించారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది కంటే ఈసారి రద్దీ అధికంగా ఉంటుందని.. 3 లక్షల వరకు వెళ్తారని అంచనా వేస్తున్నారు.

**5 రోజులపాటు..**

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు పాయింట్లను గుర్తించారు. కరీంనగర్, హుస్నాబాద్, హుజూరాబాద్, పెద్దపల్లి, గోదావరిఖని, మంథనిలో కేంద్రాల ద్వారా ఈనెల 27 నుంచి 31 వరకు 700 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఇందుకోసం రీజియన్‌లోని 338 బస్సులతోపాటు ఇతర డిపోల నుంచి మిగతావి తెప్పించనున్నారు. 2500 మంది ఆర్టీసీ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.**24 గంటలు అందుబాటులో..**కరీంనగర్ బస్‌స్టేషన్ ఆవరణలో మేడారం జాతర క్యాంపును ఏర్పాటు చేస్తున్నారు. మూడు క్యూలైన్లు, వైద్య శిబిరం, తాత్కాలికంగా శౌచాలయాలు, చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. టికెట్ల కోసం గ్రౌండ్ బుకింగ్ అమలు చేయనున్నారు. ఆయా కేంద్రాల్లో 24 గంటలు సిబ్బంది, బస్సులు అందుబాటులో ఉండనున్నాయి. తిరుగు ప్రయాణంలో మేడారంలో రీజియన్?కు సంబంధించి 7 క్యూలైన్లను ఏర్పాటు చేశారు. కరీంనగర్‌లో జాతర క్యాంపు పనులను ఆదివారం ఆర్ఎం రాజు, డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి పరిశీలించారు.

**ప్రత్యేక సర్వీసుల్లోనూ మహాలక్ష్మి పథకం**

మేడారం జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక సర్వీసుల్లోనూ మహాలక్ష్మి పథకం వర్తిస్తుంది. గ్రౌండ్ బుకింగ్ సదుపాయం కల్పించాం. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితంగా ఉంటుంది. బి.రాజు, కరీంనగర్ రీజినల్ మేనేజర్

# పేదల గూడు.. నత్తకు సరిజోడు



సారంగాపూర్ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. గూడు లేని పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చాలని తలపెట్టిన పథకం బాలారిష్టాలు దాటడం లేదు. ఇసుక, ఇటుక ధరలు పెరగడం, లబ్ధిదారుల ఆర్థిక ఇబ్బందులతో పనులు ఆలస్యమవుతున్నాయి. మహిళా సంఘాల ద్వారా రుణాలు అందిస్తున్నా నిర్మాణ ప్రగతి అంతంతే. ఏప్రిల్? నుంచి రెండో విడతలో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్ల మంజూరుకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో మొదటి విడత నిర్మాణాల్లో వేగం పెంచాల్సిన అవసరముంది.

**62 మాత్రమే పూర్తి**

జిల్లాలో మొత్తం 11,079 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు కేవలం 62 నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి.

8,353 నిర్మాణాలు ప్రారంభించగా, 2,350 బేస్‌మెంట్, 1,422 లెంటల్, 2,502 స్లాబ్? స్థాయికి పూర్తయ్యాయి.

ప్రభుత్వం అందజేసే రూ.5 లక్షల్లో బేస్‌మెంట్ వరకు పూర్తయ్యాక రూ.లక్ష, లెంటల్? వరకు మరో రూ.లక్ష, స్లాబ్? వేశాక రూ.2 లక్షలు, మొత్తం పనులు పూర్తయ్యాక మిగతా రూ.లక్ష ఇస్తున్నారు. నిర్మాణ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వెంటనే ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులు జమవుతున్నాయి.

ఇటీవల వీబీ జీ రామ్ జీ(ఉపాధిహామీ) పథకం అనుసంధానించడంతో ప్రతి లబ్ధిదారుడికి జాబ్?కార్డు జారీ చేసి 90 రోజుల పని కల్పించి రూ.22,630 వేతనాన్ని అందిస్తున్నారు. స్వచ్ఛభారత్? మిషన్? ద్వారా రూ.12 వేలు చెల్లిస్తున్నారు.

ప్రభుత్వం అందజేసే రూ.5 లక్షల నుంచి వీటిని మినహాయించి బిల్లులు అందజేయనున్నారు.

భారంగా ముడిసరకు ధరలు

ఇళ్ల నిర్మాణాల్లో కీలకమైన ఇసుక, ఇటుక కొరత కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయి. లబ్ధిదారుల అవసరమే అదనుగా వ్యాపారులు వీటి ధర పెంచారు. జిల్లాలో ఇటుక తయారీ పరిశ్రమలు ఎక్కువగా లేకపోవడం సమస్యగా మారింది. పక్కనే గోదావరి ప్రవహిస్తున్నా ఇసుక డిపోను జగిత్యాలలో ఏర్పాటు చేయడంతో గ్రామాలకు చేరేవరకు ధర రెట్టింపవుతోంది. దీంతో ఇసుక అక్రమంగా తరలించే వారిపై ఆధారపడగా ఒక్కో ట్రాక్టర్? ట్రిప్పునకు రూ.3 నుంచి 4 వేలు వసూలు చేస్తున్నారు. భవన నిర్మాణ మేస్త్రీలు సరిపడా లేకపోవడం, ఉన్న వారు కూలీ ధరలు పెంచడం పేదలకు భారంగా మారింది.

# వ్యూహాలకు పదును

సూర్యాపేట: పురపాలికలకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో అన్ని పార్టీల నాయకులు జోరు పెంచారు. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన వార్డుల రిజర్వేషన్లకు అధికారులు తెరదించారు. వార్డులతో పాటు ఛైర్మన్ పదవులకు సంబంధించిన రిజర్వేషన్లు సైతం ప్రకటించడంతో ఆశావహులు పోటీకి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల కమిషన్ ఏ క్షణంలోనైనా ప్రకటన జారీ చేసే అవకాశం ఉండటంతో వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికలకు సన్నద్ధతను పూర్తిచేశాయి. ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల్లో వార్డుల వారీగా గెలుపే లక్ష్యంగా నేతలు వ్యూహాలను రచిస్తున్నాయి.

**స్థానికంగా సమావేశాలు**

గెలుపే లక్ష్యంగా గత నెలరోజులుగా అన్ని రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నాయి. సమావేశాలు నిర్వహించి శ్రేణులను ఎన్నిలకు సిద్ధం చేశాయి. ఏడాది కాలంగా పోటీలో నిలిచేందుకు ఆశావహులు భారీ ఆశలు పెట్టుకోగా రిజరేషన్లు అనుకూలంగా రాకపోవడంతో ఉసూరుమన్నారు. తమకు అనుకూలమైన వార్డుల్లో



ప్రచార పర్వాలను మొదలుపెట్టగా ప్రతికూల రిజర్వేషన్ల కారణంగా వారి ఆశలు గల్లంతయ్యాయి. కాంగ్రెస్, భారాసలతోపాటు భాజపా నేతలు పార్టీల అనుచరగణాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

**ప్రకటనకు ఎదురుచూపు**

వార్డులు, ఛైర్మన్ పదవుల రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆశావహులు ఎన్నికల ప్రకటనకు ఎదురు చూస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నుంచే ఆశావహులు మున్సిపల్ ఎన్నికలు కూడా జరుగుతాయనే నమ్మకంతో అప్పటి నుంచి అంతా సిద్ధం చేసుకున్నారు. వార్డుల్లో తమకు అనుకూలంగా ఉన్నవారిని గత ఐదారు నెలల నుంచే కలుసుకోవడంతోపాటు చరవాణిలో మాట్లాడుతూ ఈసారి తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. తమదైన రీతిలో ప్రణాళిక రూపొందిస్తున్నారు.

# ఔరా సర్పంచి.. అనాలంటే..!

మిర్యాలగూడ : మిర్యాలగూడ మండలం శ్రీనివాసనగర్ మాజీ సర్పంచి వెంకటరమణ చౌదరి గ్రామంలోని పాఠశాలతో పాటు గ్రామంలో నిర్వహిస్తున్న బీసీ బాలికల గురుకుల పాఠశాలకు సొంత డబ్బు రూ.లక్షల్లో ఖర్చు చేసి అభివృద్ధికి పాటు పడ్డారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆధునీకరించి ఆదర్శంగా నిలిపారు. గ్రామంలో ఆలయం అభివృద్ధితో పాటు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామ ప్రజల ఆరోగ్య సంరక్షణకు చర్యలు చేపట్టి ఊరిని ఆదర్శంగా నిలిపారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇటీవలే సర్పంచులు, వార్డు సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 19 నుంచి సర్పంచులకు శిక్షణ తరగతులు సైతం నిర్వహించనున్నారు. శిక్షణ అనంతరం గ్రామాల్లో పూర్తి స్థాయి పాలనలో మునిగిపోనున్న సర్పంచులు ఇప్పటికే పలు గ్రామాల్లో చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి తమ బాధ్యతగా చర్యలు చేపడుతున్నారు. అయితే ఊరిలో బడి, గుడి, వైద్యాలయంపైన దృష్టి సారించి వాటిలో సమస్యలు పరిష్కరిస్తేనే గ్రామస్థులకు మేలు జరుగుతుందని పలువురు చెబుతున్నారు.

**విద్యాలయంపై అనుబంధం పెరగాలి..**

భావి భారత పౌరులను తీర్చిదిద్దే ప్రభుత్వ పాఠశాలలు పలు గ్రామాల్లో నిర్వీర్యమవుతున్నాయి. సుశిక్షితులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉండడంతో పాటు ప్రభుత్వం పలు రకాల సౌకర్యాలు కల్పిస్తుంది. అయినప్పటికీ క్షేత్ర స్థాయిలో నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేటు సంస్థల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.నూతన సర్పంచులు తరచూ ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ మధ్యాహ్న భోజనం నాణ్యత, పాఠశాలలో సౌకర్యాల కల్పనలో చొరవ చూపితే పూర్వ వైభవం సంతరించుకుంటాయి.

**ఆరోగ్యమే మహాభాగ్యం..**

గ్రామాల్లో ఎక్కువ శాతం అనారోగ్యాల బారిన పడుతూ చికిత్స కోసం పట్టణాలకు పరుగులు తీస్తుంటారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్యాలయం ఏర్పాటు, కుదరకపోతే వారానికో సారి ప్రభుత్వ వైద్యులతో శిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు, మందులు పంపిణీ వంటి చర్యలతో పాటు ఇది వరకే ఉన్న ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది నియామకం, కొరత లేకుండా చూడడం వంటి చర్యలు చేపట్టాలి.

**హృద'యాలయాల్లో' చోటు సాధించాలి..**

గ్రామాల్లో ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేసేందుకు ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఆలయం కీలక పాత్ర పోషించింది. అధిక గ్రామాల్లో ఆలయాభివృద్ధి, ఆలయానికి భూదానం వంటి హామీలే ఏకగ్రీవాలకు దారి తీశాయి. దీన్ని బట్టే ప్రజలకు ఆలయంతో ఎలాంటి అనుబంధం ఉందో అవగతమవుతుంది.

ఈ నేపథ్యంలో నూతన సర్పంచులు గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి పాటు పడాలి. గ్రామాల్లో ఉండే మసీదులు, చర్చిల అభివృద్ధికి సైతం పాటు పడితే ప్రజల మన్ననలు దక్కుతాయి.

# బంకుల్లో.. అన్నీ బొంకులే..!

భువనగిరి : బంకుల్లో డబ్బులు తీసుకుని పెట్రోల్, డీజిల్? పోస్తున్నారే తప్ప సౌకర్యాలపై దృష్టి పెట్టడం లేదు. కంపెనీల అధికారులు మొక్కుబడిగా తనిఖీ చేసి వెళ్తున్నారే తప్ప నిబంధనల ప్రకారం బంకు నిర్వహిస్తున్నారా.. లేదా చూడటం లేదు. పౌరసఫరాల శాఖ అధికారులు కూడా మౌఖిక హెచ్చరికలతోనే సరిపెడుతున్నారు. జిల్లాలో 88 బంకులు ఉన్నాయి. వినియోగదారులకు అందుతున్న సేవలపై పరిశీలించగా..పలు లోపాలు వెలుగులోకి వచ్చాయి.

ఉండాల్సిన సదుపాయాలు..శుద్ధమైన తాగునీరు. మరుగు దొడ్లు, స్నానపు గదులు, మూత్రశాలలు ఉండాలి. కొన్ని చోట్ల ఎప్పుడూ తాళం వేసి ఉంటాయి. శుభ్రంగా ఉంచడం లేదు. అత్యవసర పరిస్థితుల కోసం ప్రథమ చికిత్స కిట్టు ఉండాలి. కొన్ని చోట్ల కాలపరిమితి ముగిసినా అలాగే ఉంటున్నాయి.

టైర్లలో ఉచితంగా గాలి నింపేందుకు యంత్రాల ఏర్పాటు చేయాలి. చాలా చోట్ల పనిచేయడం లేదు. డీజిల్, పెట్రోల్ నాణ్యత తెలుసుకునే హక్కు వినియోగదారుడికి ఉంది. కొలత చూసుకోవడానికి పరికరాలు ఉన్నా.. కోరినప్పుడు ఇవ్వడం లేదు. చౌటుప్పల్? పట్టణంలో జాతీయ రహదారి పక్కనున్న బంకులో మరుగుదొడ్డి గదికి తాళం వేసి ఉంటుంది. నాణ్యత పరీక్షలు నిర్వహించే పరికరాలు మేనేజర్? గదిలో బీరువా కింద భద్రపర్చారు. ఐవోసీ బంక్?లో గాలి నింపుకొనే యంత్రం పని చేయడం లేదు. ఎలా ఉన్నాయంటే..బొమ్మలరామారం, చీకటిమామిడి, మర్యాల, రంగాపూర్, జలాల్?పురం గ్రామాల్లోని బంకుల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. గాలి నింపే యంత్రాలు లేవు. తాగునీటి వసతి అసలే కనిపించడం లేదు. ఆలేరు మండలంలో ఏడు పెట్రోల్? బంక్?లు ఉన్నాయి. మూడింటిలో మూత్రశాలలు, మంచినీటి వసతి లేదు. వాహనాల్లో గాలి నింపే యంత్రాలు మూలనపడ్డాయి.గుండాల పెట్రోల్? బంక్?లో మూడు నెలలుగా నో స్టాక్? బోర్డు పెట్టారు. పనిచేయడం లేదు. ఇక్కడ ఎలాంటి వసతులు లేవు. జిల్లాలోని బంకుల వివరాలుఐవోసీ 34, హెచ్?పీసీఎల్? 16, బీపీసీఎల్? 27, రిలయన్స్? 02, నయారా 09.తనిఖీలు చేస్తున్నాం: రోజారాణి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పెట్రోల్? బంకులో నాణ్యతా ప్రమాణాలు, సదుపాయాలపై తనిఖీలు చేస్తున్నాం.

# గుంత పూడింది.. వేదన తీరకుంది!

తాండూరు : చేవెళ్ల–మీర్జాగూడ మధ్య నవంబరు 3న ఆర్టీసీ బస్సు–టిప్పర్ ఢీకొనడంతో జరిగిన ఘోర దుర్ఘటనకు కారణమైన గుంత పూడ్చేయగలిగారు కానీ.. చనిపోయిన 19 మంది బాధిత కుటుంబ సభ్యుల వేదనను మాత్రం నేటికీ తీర్చలేకపోతున్నారు. ఘటన జరిగి నేటికి సరిగ్గా 54 రోజులవుతోంది. ఆ ప్రమాదం మా బతుకులను చిదిమేసింది. తెల్లారేసరికి నా అనుకునేవారందరూ దూరమయ్యారు.. ఈ దీన పరిస్థితి ఎవరికీ రాకూడదంటూ గుర్తొచ్చినప్పుడల్లా కన్నీరుము న్నీరవుతూ రోజులు గడుపుతున్నారు. అమ్మా నాన్నలను కోల్పోయి అనాథలైన పిల్లలు.. ముగ్గురు కూతుళ్లను కోల్పోయిన తల్లిదండ్రులు.. మూడు తరాలను దూరం చేసుకున్న కుటుంబాలు.. పిల్లలే ఆధారంగా జీవిస్తున్న కుటుంబం.. ఇలా ఎవరిని కదిలించినా శోకం వర్ణనాతీతం. ఈ ప్రమాదానికి టిప్పర్ యజమానిని ఇటీవల బాధ్యుడిగా చేసిన విషయం తెలిసిందే. వారి పరిస్థితి తెలుసుకునే ప్రయత్నం చేసింది..

**మానసికంగా కుంగిపోయిన సోదరుడు**

యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన అఖిలారెడ్డి మాదాపూర్‌లోని ఐఐఆర్ఎం కళాశాలలో ఎంబీఏ చదువుతోంది. కళాశాల టాపర్. రూ.24 లక్షల ప్యాకేజీతో ఉద్యోగావకాశం వచ్చిన సమయంలోనే చరవాణి కోసం ఇంటికి వచ్చి వెళుతుండగా.. బస్సు ప్రమాదంలో కన్నుమూసింది. కళాశాలలో అఖిలారెడ్డి పేరిట స్మృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ఫీజు మొత్తం తిరిగిచ్చేశారు. సోదరి మృతితో కలతచెందిన సోదరుడు సందీప్‌కుమార్‌రెడ్డి మానసికంగా ఇబ్బంది పడ్డారు. పైచదువులకు యూకే వెళ్లాల్సి ఉండగా వాయిదా వేసుకున్నారు. తాండూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో మానసిక వైద్య



నిపుణురాలి వద్ద చికిత్స పొందారు.

**ఆర్థికసాయం అందజేత**

మృతి చెందిన 19 మంది కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున, 24 మంది క్షతగాత్రులకు రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వం అందజేసింది. బస్సు డ్రైవర్ దస్తగిరి ఇద్దరు భార్యలకు, తల్లికి మూడు భాగాలుగా పరిహారం అందించారు.

**రహదారి విస్తరణ పనుల్లో వేగం**

ఘోర దుర్ఘటన తరువాత ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం మేల్కొంది. రంగారెడ్డి జిల్లా మన్నెగూడ నుంచి చేవెళ్ల, మొయినాబాద్ రోడ్డును వెడల్పు చేస్తోంది. ప్రమాదంతో ఈ దారికి మోక్షం లభించడం దురదృష్టకరమని ప్రయాణికులు, వాహనదారులు చర్చించుకుంటున్నారు.

**నిద్రలో అమ్మానాన్నలు గుర్తొస్తున్నారు**

శివలీల, భవానీ, హాజీపూర్, యాలాల మండలం

అమ్మానాన్న(బందెప్ప, లక్ష్మి) దూరమైన తరువాత బంధువులే దిక్కయ్యారు. అయినా.. రాత్రుళ్లు నిద్రలో ఒక్కసారిగా అమ్మానాన్నలు గుర్తొచ్చి మెలకువ వస్తోంది. ఘటనా స్థలం, అమ్మానాన్న మృతదేహాలు కళ్లలో మెదులుతున్నాయని ఇద్దరు పిల్లలు కంటనీరు పెట్టుకున్నారు. వీరిని దత్తత తీసుకున్న ఓ సంస్థ చదువు, బాగోగులకు ఆర్థికసాయం అందిస్తోంది.

**ఎక్కడికెళ్లినా అదే గుర్తొస్తోంది...**

ఎల్లయ్యగౌడ్, పేర్కంపల్లి, యాలాల మండలం

ఈ ఘటనలో నా ముగ్గురు కుమార్తెలు నందిని, సాయిప్రియ, తనూషలను కోల్పోయా. నా బాధ ఎవరికీ రావొద్దు. పొద్దున్నే లేచి సొంత వాహనంపై కిరాయి తోలుతూ జీవిస్తుండేవాణ్ని. ప్రస్తుతం ఎక్కడికెళ్లినా అదే ఘటన గుర్తుకొస్తోంది. ఆ ఆలోచనలతో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఏదైనా జరిగితే నావల్ల ఇతరులు ఇబ్బంది పడే ప్రమాదం ఉందని వాహనం తోలడం మానేశా.

# ఉపకార వేతనం.. విద్యార్థులకు ప్రయోజనం

బొంరాస్‌పేట: పేద, మధ్య తరగతికి చెందిన కుటుంబాల విద్యార్థులకు చేయూతనందించేందుకు, డ్రాపౌట్స్ తగ్గించడానికి ప్రభుత్వం ఏటా ఉపకార వేతనాలు అందిస్తోంది. ఇవన్నీ కేవలం ఇంటర్, డిగ్రీ ఆపై చదివే విద్యార్థులకే అన్న అభిప్రాయం చాలా మందిలో ఉంది. అవగాహన లేక దరఖాస్తు చేసుకోవడం లేదు. 2025–26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రెండు రకాలుగా ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లను అందించడానికి దరఖాస్తులు కోరుతోంది.

**వీరు అర్హులు..**

ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లోని ఎస్సీ విద్యార్థులు అర్హులు. ఈ నెలాఖరులోగా %http:telangana.epass.cgg.gov.in%–లో దరఖాస్తు చేసుకోవాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.50 లక్షల్లోపు ఉండాలి. ఆదాయం, కులం, ఆధార్‌కార్డు, తపాలాశాఖలో తెరిచిన ఖాతా పుస్తకం, బోనాఫైడ్ జిరాక్సులను, విద్యార్థి ఫొటోను జత చేసి జిల్లా కార్యాలయంలో ఒక కాపీ అందించాలి. డబ్బులు నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ అవుతాయి.

**రెండు రకాలుగా..**

5- 8వ తరగతి చదువుతున్న బాలికలకు ఏడాదికి రూ.1500, బాలురకు రూ.1000 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. 9, 10వ తరగతుల వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం చొప్పున భరించి రూ.3500 చొప్పున ఇస్తున్నాయి. ఒకసారి దరఖాస్తు చేసుకుంటే 10వ తరగతి వరకు అందుతాయి. జిల్లాలో ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు 1271 ఉన్నాయి. ఇప్పటి వరకు 1100 పాఠశాలలు నమోదు చేసుకున్నాయి. 171 ప్రైవేటు బడులు ఇంకా రిజిస్టరు చేసుకోలేదు. జిల్లా నుంచి 2100 మంది విద్యార్థులను దరఖాస్తు చేయించాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకు 1450 మంది దరఖాస్తు చేసుకున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి..**

విద్యార్థులకు ప్రభుత్వం అందించే ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెలాఖరులోపు అందరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

కమలాకర్‌రెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి

# బడిలో ఐఐటీ పాఠాలు!



కరీంనగర్ : పాఠశాల దశలోనే అధునాతన సాంకేతిక కోర్సుల పట్ల అవగాహన పెంచుకోవడానికి మద్రాస్ ఐఐటీ స్వల్పకాలిక కోర్సులు ఉపయోగపడుతున్నాయి.. 'స్కూల్ కనెక్ట్' పేరిట ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తుండగా పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు సాంకేతిక కోర్సులకు సంబంధించి ప్రాథమిక అంశాలపై అవగాహన పెంచుకుంటున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 71 విద్యాసంస్థలు..**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 71 ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లోని విద్యార్థులు మద్రాస్ ఐఐటీ వారి వివిధ కోర్సులను అభ్యసిస్తున్నారు. డేటా సైన్స్–ఏఐ, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్, ఆర్కిటెక్చర్ – డిజైన్, గణితం – కంప్యూటింగ్, గణితం – గేమ్–పజిల్స్, పర్యావరణ శాస్త్రం, బయో ఇంజినీరింగ్– బయోలాజికల్ సైన్స్, ఇంట్రడక్షన్ టూ లా, వైమానిక శాస్త్రం ప్రాథమికాంశాలు, మానవ శాస్త్రాల పరిచయం అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో రిజిస్ట్రేషన్లు చేసుకున్న పాఠశాలలు, కళాశాలలకు ఈ అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఎంపికైన విద్యా సంస్థకు ఐఐటీ వారు అందించే యునిక్ ఐడీ ద్వారా విద్యార్థులు వివిధ కోర్సుల్లో శిక్షణ కోసం రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. ఒక్కో కోర్సుకు 2 నెలల పాటు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తుండగా, విద్యార్థులు వ్యక్తిగత ఐడీ ద్వారా కోర్సులకు సంబంధించిన విద్యా విషయాలు, వీడియోలను పొందుతారు. ప్రతి 15 రోజులకోసారి వీకెండ్ పరీక్షలు, తుదకు ఫైనల్ పరీక్ష ఉంటుంది. ఇందులో అర్హత సాధించిన వారికి ధ్రువపత్రాలు ఇస్తున్నారు.ః విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే ప్రతి గూగుల్ మీట్ ద్వారా ఐఐటీ ఆచార్యులు నివృత్తి చేస్తారు.

**ఈ కోర్సులతో ప్రయోజనం ఇలా..**

డిజిటల్ నైపుణ్యాలు, లాజికల్ థింకింగ్ పెరుగుతుంది.

ఉన్నత విద్యావకాశాలపై అవగాహన కలుగుతోంది.

ఆధునిక సాంకేతికతపై పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు పట్టు సాధిస్తున్నారు. తీరిక సమయంలో ఆన్‌లైన్ ద్వారా ఇంటి వద్దే తరగతులు వినే, చూసే వెసులుబాటు ఉండటంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు.

కృత్రిమ మేధపై ఆసక్తి పెరిగింది

డేటా సైన్స్- ఏఐ 8 వారాల కోర్సు పూర్తి చేసి మెరిట్ సర్టిఫికెట్ పొందా. కొత్త విషయాలు తెలుసుకోవడమే కాదు చిన్న ప్రోగ్రామ్స్ చేయడం నేర్చుకున్నా. కృత్రిమ మేధ భవిష్యత్తులో ఏరకంగా ఉపయోగపడుతుందనే దానిపై అవగాహన పెరిగింది.

పి.సహస్ర, జడ్పీ ఉన్నత పాఠశాల, ఇల్లంతకుంట

మార్పులపై అవగాహన

డేటా సైన్స్- ఏఐ కోర్సులో చేరడం ద్వారా చాలా అంశాలు నేర్చుకున్నా. సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చే మార్పులపై అవగాహన కలిగింది. ఇంజినీరింగ్ కోర్సుల్లోని పలు అంశాలను ఇప్పుడే నేర్చుకునే అవకాశం దీని ద్వారా పొందా.కె.దిలీప్‌కుమార్, జడ్పీ ఉన్నత పాఠశాల, గట్టుబూత్కూర్

# అడిగేవారేరి.. అంతా మా ఇష్టం..!



మధిర : జిల్లాలోని వివిధ గ్రామాలు, మండల కేంద్రాల్లో దుకాణాలు, వ్యాపార సముదాయాలు ఉన్నప్పటికీ ఆ స్థాయిలో ట్రేడ్ లైసెన్సుల సంఖ్య మాత్రం పెరగటం లేదు. పంచాయతీల ఆదాయానికి గండి పడుతోంది. పెద్ద పంచాయతీల్లో, మండల కేంద్రాల్లో ట్రేడ్ లైసెన్స్ లేని దుకాణాలపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారిస్తే పంచాయతీలకు ఆదాయం సమకూరే అవకాశాలు మెరుగుపడతాయి.

**పంచాయతీల ఆదాయం కరవు..**

జిల్లాలో 20 మండలాల్లో 571 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీలకు కళ్లెదుటే ఆదాయ మార్గాలున్నా.. అధికారులు వాటిపై దృష్టి కేంద్రీకరించటంలేదు. దీనిపై వివిధ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద పంచాయతీలు, మండల కేంద్రాల్లో ఇళ్లలో నిర్వహిస్తున్న దుకాణాల నుంచి పూర్తిస్థాయిలో ట్రేడ్ లైసెన్స్‌లు వసూలు చేయటం లేదు. గృహాల్లోనే వివిధ వ్యాపారాలు సాగిస్తున్నారు. కొందరు ఇప్పటికీ గృహావసరాల దుకాణాల పేరుతోనే పన్నులు చెల్లిస్తున్నారు. అందుకే పంచాయతీలకు ఆదాయం తగ్గుతోంది. గ్రామాల్లో వ్యాపారాలు కొనసాగించేవారు ట్రేడ్ లైసెన్సులు తీసుకుంటే ఆయా పంచాయతీలకు ఆర్థిక వనరులు సమకూరుతాయి. ప్రగతికి ఊతమవుతాయి. అంతేగాక లైసెన్సులు పొందితే ఆయా వ్యాపారులకు ప్రభుత్వ పథకాల ద్వారా మరింత ఆర్థిక భరోసా దక్కనుంది. ఆధ్యాత్మిక క్షేత్రాలు ఉన్న గ్రామాల్లో సైతం తక్కువ సంఖ్యలోనే ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకుంటున్నారు. ఆలయాల పరిసర ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నా కొందరు అనుమతులు తీసుకోవటం లేదు. తెలంగాణ చిన తిరుపతిగా పేరొందిన జమలాపురం పుణ్యక్షేత్రంలో వందల కొద్దీ దుకాణాలు నిర్వహిస్తున్నా కొందరే లైసెన్సులు పొందారు. తెలుగు రాష్ట్రాల నుంచి నిత్యం వందలాది మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. వ్యాపార లావాదేవీలు రూ.లక్షల్లోనే సాగుతుంటాయి. ప్రతి ఒక్కరూ లైసెన్సులు తీసుకుంటే ఇక్కడి పంచాయతీకి ఆదాయం మెరుగుపడి అభివృద్ధి పనులకు ఖర్చుచేసే అవకాశం ఉంటుంది. కొన్ని గ్రామాల్లో కొందరు తమ ఇళ్ల ముందు దుకాణాలకు గదులు నిర్మించి వ్యాపారానికి అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారు. అయినా ఇంటికే పన్నులు చెల్లిస్తున్నారు. ఇటీవల కొంతకాలంగా గ్రామాల్లో ట్రేడ్ లైసెన్స్‌లపై అధికారులు దృష్టి సారించారు. ఇది పూర్తి స్థాయిలో అమలైతే ఆదాయం సమకూరుతుంది.

మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు పంచాయతీల్లోనూ వ్యాపారాలు నిర్వహించే దుకాణదారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలి. తద్వారా ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయి. చిరు వ్యాపారులకు భరోసాగా ఉంటుంది. గ్రామాల్లో ఆదాయం సమకూరి అభివృద్ధికి తోడ్పాటుగా నిలుస్తుంది. ఎవరైనా లైసెన్సులు తీసుకోకుండా వ్యాపారాలు కొనసాగిస్తుంటే ఆయా దుకాణాలను సీజ్ చేస్తాం.

ఆశాలత, జిల్లా పంచాయతీ అధికారి

# 'నడిపేవారు' లేక నిలిపేశారు!



నర్సాపూర్: నర్సాపూర్ డిపోలో డ్రైవర్ల కొరత వేధిస్తోంది. ప్రస్తుతమున్న బస్‌లకే సరిపోవడం లేదు. మరికొద్ది రోజుల్లో కొత్తగా బస్సులు వచ్చే అవకాశం ఉంది. వాటిని ఎలా నడపాలో అర్థం కాక ఆర్టీసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు ప్రయాణికులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న వారిపై అదనపు భారం మోపుతున్నారు. నర్సాపూర్‌లో డిపోను మూడేళ్ల క్రితం ప్రారంభించారు. 27 సంస్థ సర్వీసులు(ఇవన్నీ పల్లెవెలుగులే), 3 అద్దెవి(నిర్వాహకుల చోదకులే) ఉన్నాయి. వీటికి సంస్థ పరంగా కండక్టర్లు ఉంటారు. డిపో ప్రారంభంలో అన్నీ పాత డొక్కు బస్సులనే అందుబాటులో ఉంచగా అవి క్రమంగా శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిని తొలగిస్తూ 15 వరకు కొత్తవి పంపారు. దీంతో మొత్తం 27 బస్సులున్నాయి. వీటిని నడిపేందుకు 36 మంది డ్రైవర్లున్నారు. ఇద్దరు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. మిగిలింది 34 మంది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా 44 మంది అవసరం ఉండగా ఇంకా 10 మంది తక్కువగా ఉన్నారు. ఉన్న వారిలో ఎవరైనా ఆరోగ్య సమస్యలతో రాకపోతే ఆ రోజు బస్సులు డిపోకే పరిమితం అవుతాయి. దీంతో ఎక్కువగా నర్సాపూర్–బాలనగర్, నర్సాపూర్–జోగిపేట, నర్సాపూర్–పటాన్‌చెరుకు వెళ్లే ప్రయాణికులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే వారికి ఇబ్బందులు తప్పవు. బస్సుకు ముగ్గురు చోదకులు అందుబాటులో ఉండాలన్న నిబంధన కనిపించడం లేదని విమర్శలున్నాయి. అప్పుడప్పుడు ఉన్న వారికే అదనంగా డ్యూటీలు వేస్తూ నెట్టుకొస్తున్నారు.

**ఉన్నవారితోనే సర్దుబాటు చేస్తున్నాం**

డ్రైవర్ల కొరత ఉందని ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతం ఉన్న వారితోనే సర్దుబాటు చేస్తున్నాం. కొత్తగా నియామకం జరిగితేనే సమస్యలు తీరుతాయి. వారంతపు సెలవుల్లో ఉన్నవారికి అదనపు డ్యూటీలు వేస్తున్నాం. ఇందుకు అదనంగా చెల్లిస్తున్నాం. డ్రైవర్లపై పనిభారం పడుతున్నది వాస్తవమే. ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియామకాలు చేపడుతున్నాం. హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగిన వారికి అవకాశం ఇస్తున్నాం.

లక్ష్మణ్, డిపో పర్యవేక్షకులు

# ఆరుబయట వాహనం.. సెల్లార్‌లో వ్యాపారం!

సూర్యాపేట: జిల్లాలోని పురపాలికల్లో సెల్లార్లు వ్యాపార నిలయంగా మారాయి. వాటిలో వాహనాలను నిలుపుకొనే వెసులుబాటు కల్పించాలి. ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్, దస్తులు, మెకానిక్, తదితర వాటికి ఉపయోగిస్తున్నారు. ఆసుపత్రి నిర్వాహకులు మాత్రం ల్యాబ్‌లు, ఆపరేషన్ థియేటర్లకు వాడుకుంటున్నారు. దీంతో వాహనదారులు తమ వాహనాలను ఆరుబయటే నిలుపుతున్నారు. జిల్లాలోని ఐదు పురపాలికల్లో 42 వరకు సెల్లార్లున్నాయి. వీటిలో అత్యధికం దుకాణాలు నిర్వహిస్తున్నారు. అందులో ఎవరూ వాహనాలను నిలపడం లేదు. కొందరు నిర్వాహకులు సామగ్రి ఉంచి తాళం వేస్తున్నారు.

**పట్టించుకోని అధికారులు..**

పుర అధికారులు పట్టించుకోకపోవడంతో సెల్లార్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిర్మాణ సమయంలో అధికారులకు మామూళ్లు ఇవ్వడంతో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని



ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో వారు ఆడిందే ఆట.. పాడింతే పాటగా వాటిని వినియోగిస్తున్నారు. ఆరుబయట వాహనాల కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. పట్టణాలు రోజురోజుకు విస్తరిస్తుండటంతో వాహనాల వినియోగం పెరిగింది. వివిధ అవసరాల నిమిత్తం చుట్టుపక్కల గ్రామాలవారు తరచూ పట్టణాలకు వస్తుంటారు. ఈ కారణంగా వాహనాలు మళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**చర్యలు తీసుకుంటాం: హన్మంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట**

నిర్వాహకులు తమ సెల్లార్లలో వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. వాటిని వాహనాల పార్కింగ్‌కే వినియోగించాలి. తనిఖీలు చేపట్టి వ్యాపారాలు చేయకుండా చూస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే శాఖాపరంగా చర్యలు చేపడతాం.

# బల్క్ కనెక్షన్ల ఆదాయం పెంచుకుందాం

హైదరాబాద్ : జలమండలికి అత్యధిక రాబడిని ఇస్తున్న బల్క్ నీటి కనెక్షన్ల నుంచి ఆదాయాన్ని మరింత పెంచుకునేలా కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రస్తుతం సుమారు రూ.77 కోట్లు నెలకు బల్క్ కనెక్షన్ల నుంచి రాబడి వస్తుండగా దీన్ని రూ.100 కోట్లకు పెంచేలా దృష్టిసారించింది. జలమండలికి ఆదాయంలో కీలకంగా ఉన్న బల్క్‌కనెక్షన్లు 72 వేలు దాకా ఉన్నాయి. బల్క్ కనెక్షన్లలో బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ భవనాలతో పాటు వివిధ సంస్థలు ఉన్నాయి. ప్రతినెలా జలమండలికి రూ.130 కోట్లు రాబడి వస్తుండగా ఇందులో అత్యధిక శాతం వాటి నుంచే వస్తోంది. జలమండలికి 14.2 లక్షల కనెక్షన్లు ఉన్నా రాబడి వచ్చే కనెక్షన్లు



1.25 లక్షలు మాత్రమే ఉన్నాయి. సుమారు 8 లక్షల కనెక్షన్లు ఉచిత కనెక్షన్లుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అత్యధిక రాబడిని ఇచ్చే కనెక్షన్లను పెంచుకోవడం, ఉన్న కనెక్షన్లకు నికరంగా నీటిని సరఫరా చేసి ఆదాయాన్ని సమకూర్చుకోవడం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి బల్క్ కనెక్షన్‌లపై ప్రత్యేక సమీక్ష చేస్తున్నారు. బల్క్ కనెక్షన్ల నుంచి నీటి వినియోగ ఛార్జీలను కచ్చితంగా వసూలు చేసేలా జనరల్ మేనేజర్ల నుంచి మేనేజర్ల దాకా బాధ్యతలు అప్పగించారు. లక్ష్యం మేరకు ఛార్జీలు వసూలు చేస్తేనే వేతనాలు ఇచ్చే పరిస్థితి ఉందని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. గతంలో ఉదాసీనంగా వ్యవహరించడంతో రూ.1700 కోట్లదాకా బకాయిలు ఉన్నాయి. అత్యధికం ప్రభుత్వరంగ సంస్థలతో పాటు ప్రైవేటు సంస్థలు ఉన్నాయి.

# సరళం.. పారదర్శకం

హైదరాబాద్: హెచ్ఎండీఏ పరిధిలోని భూ వినియోగ మార్పిడి(సీఎల్‌యూ) ప్రక్రియ ఇక వేగవంతం కానుంది. పారదర్శకంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం తాజాగా జీవో వెలువరించింది. ఇప్పటివరకు సీఎల్‌యూ దరఖాస్తులను మ్యానువల్‌గా సమర్పించేవారు. ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే స్వీకరించనుంది. మాస్టర్‌ప్లాన్‌లో ఒక అవసరం కోసం కేటాయించిన భూమిని వేరే వినియోగానికి వాడే సందర్భంలో చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) తప్పనిసరి. హెచ్ఎండీఏకు దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రత్యేక జీవోతో మాస్టర్‌ప్లాన్‌లో ఆ మేరకు భూ వినియోగ మార్పిడికి అంగీకరిస్తుంది.

సీఎల్‌యూలో మార్పులు ఇలా..ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరించే సమయంలోనే హెచ్ఎండీఏ/టౌన్ అండ్ కంట్రి ప్లానింగ్(డీటీసీపీ), అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ ప్రాసెసింగ్, ఇతర రుసుములు వసూలు చేయాలి దరఖాస్తుతో పాటు తాజా పరిస్థితిని పూర్తి వివరాలతో దస్త్రం ప్రభుత్వం ముందుంచాలి. హెచ్ఎండీఏ లేదా ఇతర అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల నుంచి వచ్చిన సీఎల్‌యూ ప్రతిపాదనలను, 2014లో ఏర్పాటైన సీఎల్‌యూ కమిటీలు పరిశీలించి తర్వాతనే ప్రభుత్వానికి సిఫార్సులు చేస్తారు. కమిటీ సూచనల మేరకు, సంబంధిత మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి మంత్రి ఆమోదం పొందిన తర్వాతే ప్రభుత్వం ఆమోదం లేదా తిరస్కరణపై తుది నిర్ణయం తీసుకుంటుంది.

అభ్యంతరాలు రాకపోతే కన్వర్షన్ ఛార్జీలు వసూలు చేసి, వివరాలు ప్రభుత్వానికి పంపాలి. అభ్యంతరాలు వస్తే వాటిని పరిశీలించి ఆ వివరాలతో నివేదికతో సర్కారుకు తిరిగి తీర్మానాన్ని పంపాలి.

కన్వర్షన్ ఛార్జీలు వసూలు చేసిన తర్వాత ప్రభుత్వం సీఎల్‌యూపై తుది ఉత్తర్వులు జాచేస్తుంది. ఆమోదించిన భూ వినియోగ మార్పులను మాస్టర్‌ప్లాన్‌లో అనుసంధానించేందుకు ఆదేశాలు జారీ చేస్తుంది.




# జిల్లాల పునర్వ్యవస్థీకరణపై నజర్

హైదరాబాద్: రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాష్ట్ర విభజన అనంతరం 2022 వరకు కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుతో కొన్నిచోట్ల పరిపాలన, జోన్లు, స్థానిక వెసులుబాటు పరంగా సమస్యలు ఉన్నాయంటూ భారీగా విజ్ఞప్తులు వచ్చాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిల్లాల పునర్వ్యవస్థీకరణపై సమీక్ష చేస్తామని ప్రకటించింది. గతంలో విభజన అశాస్త్రీయంగా జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు ప్రకటించారు. తాజాగా శాసనసభలోనూ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా ఈ విషయంపై మరింత స్పష్టత ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఏ ప్రాతిపదికన మార్పులు, చేర్పులు చేయాలన్న దానిపై ప్రాథమిక స్థాయిలో కసరత్తు జరుగుతున్నట్లు తెలిసింది.

**అవసరమైతే కుదింపు...** రాష్ట్రంలో పాలనాపరంగా సమస్యాత్మకంగా పలు రెవెన్యూ డివిజన్లు, మండలాలు ఉన్నట్లు ప్రభుత్వం భావిస్తోంది. కొన్ని మండలాలు.. రెండు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ఉండటం, కొన్ని శాసనసభ, పార్లమెంట్ నియోజకవర్గాలు రెండు మూడు జిల్లాల పరిధిలో ఉండటంతో పథకాల అమలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అభివృద్ధి పనుల పురోగతి, నిధుల కేటాయింపు సమయంలోనూ చిక్కులు ఎదురవుతున్నాయి. దీంతో ఏదైనా ఒకే జిల్లా పరిధిలోకి ఉండేలా.. లేదంటే ఒకే పార్లమెంట్ పరిధిలోకి వచ్చేలా మార్పులు అవసరమని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. గతంలో ముఖ్యమంత్రి కూడా ఈ విషయమై స్పష్టత ఇచ్చారు. శాస్త్రీయంగా ఏర్పాటు ఉండేలా జ్యుడిషియల్ కమిటీ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. 10 జిల్లాలు 48 రెవెన్యూ డివిజన్లు, 466 మండలాలతో ఏర్పడిన రాష్ట్రంలో 2016, అక్టోబరులో తొలిసారి పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. 31 కొత్త జిల్లాలు, 74 రెవెన్యూ డివిజన్లు, 584 మండలాలను ఏర్పాటు చేశారు. అనంతరం 2020, 21లలో నారాయణపేట, ములుగు జిల్లాలను, మరికొన్ని మండలాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 33 జిల్లాలు, 74 రెవెన్యూ డివిజన్లు, 612 మండలాలు ఉన్నాయి. తాజాగా 12 రెవెన్యూ డివిజన్లు, 25 మండలాల ఏర్పాటుకు విజ్ఞప్తులు వచ్చినట్లు సమాచారం. కొన్ని మండలాల్లో గ్రామాల విభజన శాస్త్రీయంగా లేదని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. పక్కనే మండల కేంద్రం ఉన్నప్పటికీ ఎక్కడో దూరంగా ఉన్న మండలంలో కలపడం, ఒక జిల్లా పరిధిలోని మండలం వేరే జిల్లా పరిధిలో ఉన్న నియోజకవర్గంలోకి చేరడం లాంటి సమస్యలు ఉన్నాయి. జడ్పీ సమావేశాలు, అభివృద్ధి పనుల కేటాయింపు సమయంలో ఇద్దరు, ముగ్గురు కలెక్టర్లు, జిల్లా అధికారులను సమన్వయం చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత జోనల్ వ్యవస్థను నూతనంగా అమల్లోకి తేవడంతో రంగారెడ్డి జిల్లా నుంచి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోకి చేరిన గండీడ్, మహ్మదాబాద్ మండలాల్లో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జోగులాంబ గద్వాల, రాజన్న సిరిసిల్లతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ పలు మండలాల్లో పాలనాపరంగా సమస్యలున్నట్లు విజ్ఞప్తులు వచ్చాయి. నూతన జిల్లాల ఏర్పాటు అనంతరం రాష్ట్రాన్ని రెండు బహుళజోన్లు, ఏడు జోన్లుగా ప్రభుత్వం విభజించింది. దీనిప్రకారం ఉద్యోగుల నియామకం, పదోన్నతులు చేపడుతున్నారు. ఇప్పుడు పునర్వ్యవస్థీకరణ చేస్తే జోన్లలోనూ మార్పులు చేయాల్సి ఉంటుంది. జిల్లాల పేరు మార్పులపై రైల్వే, పోస్టల్, సర్వే ఆఫ్ ఇండియా తదితర సంస్థల నుంచి నిరభ్యంతర పత్రం తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేపట్టిన జనగణనను ఈ ఏడాది నాటికి పూర్తి చేయనుంది. ఈ ప్రక్రియ పూర్తిచేసేంతవరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల సరిహద్దుల్లో రాష్ట్రాలు మార్పులు చేస్తే ఇబ్బందులు తలెత్తుతాయని సూచించిందని ఓ అధికారి 'ఈనాడు'కు తెలిపారు. రాష్ట్రంలో మార్పులు చేస్తే కేంద్రం నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



# ఏపీ పై కాంగ్రెస్ ఫోకస్.. తెరపైకి కొత్త నేత!

అమరావతి : ఏపీపై కాంగ్రెస్ హై కమాండ్ ఫుల్ ఫోకస్ పెట్టింది. వచ్చే ఎన్నికల నాటికి బలంగా ఉనికి చాటాలని భావిస్తోంది కాంగ్రెస్ పార్టీ. ఎందుకంటే ఏపీ అసెంబ్లీతో పాటే సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి. ఆ సమయానికి పార్టీ బలం పుంజుకునేలా చేయాలన్నది అధినాయకత్వం ఆలోచన. ముఖ్యంగా ఏపీ పర్యవేక్షణ బాధ్యతలను ప్రియాంక గాంధీ చూస్తున్నారు. ఆమె నేరుగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు గమనించి మార్పులు చేర్పులు చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా షర్మిలను తొలగించి కొత్త నాయకత్వాన్ని తెరపైకి తెస్తారని తెలుస్తోంది. ప్రముఖంగా ఓ కాపు నేత పేరు వినిపిస్తోంది. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వానికి ఏపీ నుంచి అధిక మద్దతు ఉంది. ఇక్కడ ప్రభావం చూపిస్తే ఎన్డీఏ కు ధీటుగా కాంగ్రెస్ పార్టీని నిలపవచ్చన్నది అధినాయకత్వం ఆలోచన.

**షర్మిల తొలగింపు ఖాయం..** 2024 ఎన్నికలకు ముందు వైఎస్ షర్మిలకు కాంగ్రెస్ రాష్ట్ర బాధ్యతలు అప్పగించారు. కానీ ఆమె వ్యక్తిగత అజెండాతో ముందుకు వెళ్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. పైగా ఏపీలో ఎన్డీఏ కూటమి ఉంది. దానికి ధీటుగా వెళ్లాల్సిన షర్మిల జగన్మోహన్ రెడ్డిని వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకున్నారు. అయితే గతంలో కాంగ్రెస్ పార్టీని జగన్ దెబ్బతీసి ఉన్నందున కాంగ్రెస్ హై కమాండ్ కూడా షర్మిలను ప్రోత్సహించింది. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కూడా జగన్మోహన్ రెడ్డిని షర్మిల టార్గెట్ చేయడం కాంగ్రెస్ హై కమాండ్ కు నచ్చలేదు. అందుకే ఆమె స్థానంలో కొత్త నేతను రంగంలోకి దించనున్నట్లు సమాచారం. అది కూడా భవిష్యత్తు ఆలోచనతోనే ఆ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. షర్మిల ఉంటే జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ వైపు చూడరు. భవిష్యత్తులో జగన్ కాంగ్రెస్ పార్టీ వైపు చూసేలా కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించినట్లు సమాచారం.

**నేరుగా ప్రియాంక ఫోన్లు..** కాంగ్రెస్ పార్టీకి అధినాయకులుగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. అందుకే జాతీయస్థాయిలో బలోపేతం చేయాలంటే ఈ ముగ్గురు నేతలు తలో రాష్ట్రాల పర్యవేక్షణ బాధ్యతలు తీసుకోవాలి. అందులో భాగంగానే ఏపీ పర్యవేక్షణ బాధ్యతలను ప్రియాంక గాంధీ తీసుకున్నట్లు సమాచారం. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి వివిధ కారణాలతో బయటకు వెళ్లిపోయిన వారికి నేరుగా ఆమె ఫోన్లు చేస్తున్నారు. అయితే బలమైన కాపు సామాజిక వర్గానికి చెందిన యువనాయకత్వానికి రాష్ట్ర పగ్గాలు అప్పగిస్తే బాగుంటుందన్న అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే వంగవీటి మోహన్ రంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణకు బాధ్యతలు కట్టబెడితే బాగుంటుందన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఓ మాజీ ఎంపీ మధ్యవర్తిత్వంతో వంగవీటి రాధాకృష్ణతో చర్చలు కూడా జరిగినట్లు తెలుస్తోంది. ఆయన సానుకూలంగా స్పందిస్తే కాంగ్రెస్ పార్టీలో చేర్పించి అధ్యక్ష బాధ్యతలు ఇస్తారని సమాచారం. మరి ఈ ప్రచారంలో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# చైనా చిన్నబోతోంది...షాకింగ్ గా జననాల రేటు



ఆ మధ్య దాకా ప్రపంచంలో అతి పెద్ద జనాభా కలిగిన దేశం చైనా అని అంతా చెప్పుకున్నారు. చైనా బరువుగా కనిపించేంది. సంతాన లక్ష్మిగానూ అగుపించేది. భారత్ ఆ తరువాత స్థానంలో ఉండేది. కానీ ఇపుడు సీన్ రివర్స్ అయింది. భారత్ లో జనాభా పెరుగుతోంది. ప్రపంచంలో జనాభాలో నంబర్ వన్ గా ఇండియా ఉంది. చైనా తీరు తిరోగమనంలో ఉంది. జననాల రేటు అయితే దారుణంగా తగ్గిపోతోంది. గిట్టే వారు తప్ప పుట్టే వారు కనిపించడం లేదు దాంతో చైనాలో ఇది అందోళకరమైన అంశంగా మారుతోంది.

**కనిష్ట స్థాయిలోకి :** చైనాలో వరసగా చూస్తే నాలుగవ ఏడాది కూడా బర్త్ రేట్ తక్కువగానే ఉంది అని నివేదికలు చెబుతున్నాయి.

ఎంతలా అంటే 1949 తరువాత అంతటి కనిష్ట స్థాయికి జననాల రేటు పడిపోయింది అని అంటున్నారు. ఇది పూర్తిగా ఇబ్బంది కలిగించేదిగా అంటున్నారు. వృద్ధులు అధికంగా ఉన్నారు, యువత తగ్గిపోతోంది, పనిచేసే వారు లేకుండా పోతున్నారు అన్న బెంగ చైనాకు పట్టుకుంది. ఇక జనాభా పెంచండి అని ఎంతలా ప్రభుత్వాలు మొత్తుకుంటున్నా ఆశించిన ఫలితలౌ అయితే రావడం లేదు అని అంటున్నారు. ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు కూడా అందిస్తోంది కానీ రిజల్ట్ వెరీ బ్యాడ్ గా ఉంది అని అంటున్నారు.

**మరణాలే ఎక్కువ :** ఏ దేశంలో అయినా మరణాలు జననాలు సమానంగా ఉంటే ఒక పద్ధతి, మరణాలు తగ్గి జనాభా అధికంగా ఉంటే అదొక సమస్య. మరణాలు పెరిగి జననాలు తగ్గితే అది ఇంకా పెద్ద సమస్య. ప్రస్తుతం చైనా ఇలాంటి సమస్యనే ఎదుర్కోంటోంది అని అంటున్నారు. ఇక చైనా నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ ఎన్?బీఎస్ గణాంకాల ప్రకారం చూస్తే కనుక 2025లో చైనాలో 79.2 లక్షల జననాలు నమోదు అయ్యాయి. అదే సమయంలో కా1.13 కోట్ల మరణాలు జరిగాయి.

అంటే జననాల రేటు ప్రతి 1000 మందికి 5.63గా నమోదైందని అంటున్నారు. ఇది 2024లో నమోదైన 95.4 లక్షల జననాలతో పోలిస్తే 17 శాతం తక్కువగా ఉందని కూడా గుర్తు చేస్తున్నారు. ఇక మరణాల రేటు తీసుకుంటే ప్రతి 1000 మందికి 8.04కి పెరిగిందని ఇది ఏకంగా 1968 తర్వాత అత్యధికంగా ఉండడంతో ఆందోళన పెంచే అంశమని చైనా ఏలికలు కలవరపడుతున్నారు.

**లక్షల్లో తగ్గిపోతూ :** ఏ ఏటికి ఆ ఏడు లక్షలలో జనాభా చైనాలో తగ్గిపోతోంది. 2024లో పోలిస్తే 2025లో జనాభా 33.9 లక్షలు తగ్గిందని అంటున్నారు. లేటెస్ట్ లెక్కలతో చైనా మొత్తం జనాభా 140.5 కోట్లకు చేరినట్లు అయింది. ఇక 1949 తర్వాత చైనాలో ఈ మాదిరిగా జననాల రేటు దారుణంగా పడిపోవడం ఇదే ఫస్ట్ టైం అని అంటున్నారు. పిల్లలను కనండి ఆర్థిక సాయం చేస్తామని చెబుతోంది ప్రభుత్వం, అలాగే జనాభాను పెంచండి పన్నులో రాయితీలు ఇస్తామని కూడా అంటోంది. ఇవే కాదు ఇతరత్రా అనేక రకాలైన హామీలు ప్రోత్సాహకాలు ఇస్తున్నారు, అయినా కానీ జనాభా మాత్రం పెరగడం లేదు, చైనా పాలకులకు దీంతో ఏమి చేయాలో అర్థం కాకుండా ఉందని అంటున్నారు.

**ఓల్డేజ్ చైనా :** ఇపుడు చైనాను చూస్తే ఓల్డేజ్ కంట్రీ అనే అంటారుట. ఎందుకంటే అక్కడ ఓల్డేజ్ పీపుల్ ఎక్కువ అయ్యారు. మొత్తం జనాభాలో వారి శాతం ఏకంగా 23 కి చేరింది. అంటే 32.3 కోట్లుగా ఉన్నారు అన్న మాట. ఇక పనిచేసే ఏజ్ ఉన్న వారి శాతం చూస్తే 60.6 శాతానికి తగ్గింది. ఈ పని చేసే ఏజ్ గ్రూప్ ని 16 ఏళ్ళ నుంచి 60 ఏళ్ళ మధ్యలో ఉంచారు. అయితే చైనాలో జనాభా తగ్గుదల అన్నది ఆందోళకరమైన పరిణామం కాదని ఎన్‌బీఎస్ అధికారి వాంగ్ పింగ్?పింగ్ అంటున్నారు. ఈ రోజుకి కూడా చైనా జనాభాయే పెద్దది అని ఆయన అంటున్నారు. జనాభా నాణ్యత కూడా బాగా మెరుగుపడుతోంది అని చెబుతున్నారు. అయితే తగ్గుతున్న జననాలు పెరుగుతున్న మరణాలు అలాగే అధికమవుతున్న వృద్ధ జనాభా ఇవన్నీ చైనాకు పెను ముప్పే అని నిపుణుల నుంచి వినిపిస్తున్న మాటగా ఉంది.

## భారత్ నీటి దెబ్బ...పాక్ నోట అబ్బా !

పాకిస్తాన్ కి భారత్ నుంచి ఏ ప్రభుత్వం చేయని విధంగా నీటి దెబ్బ తీసి చుక్కలు చూపించింది కేంద్ర ప్రభుత్వం. దీంతో పాక్ ఇపుడు అబ్బా అంటోంది. ఒకటా రెండా ఏకంగా తొమ్మిది నెలలు కావస్తోంది. పాక్ కి నీటి గండం అంతకంతకు పెను సుడి గుండమైపోతోంది. పాక్ బతుకు అంతా సింధూ నదీ జలాల మీదనే ఆధారపడి ఉన్నాయి. అయినా ఒక వైపు నీటిని తీసుకుంటూ మరో వైపు నిప్పులు కురిపిస్తూ ఏడున్నర దశాబ్దాల పాటు భారత్ తో చెలగాటమే ఆడింది. పర్యవసానమే మోడీ ప్రభుత్వం సింధూ నదీ జలాలను నిలిపేసి పాక్ నోటికి బిరడా బిగించేసింది.

**పదేళ్ళ క్రితమే :** నిజానికి పాక్ కి నీటి కష్టాలు ఏంటో తెలియచేయాలని పదేళ్ళ క్రితం అంటే 2016లోనే భారత్ ఆలోచన చేసింది. కానీ పాక్ బుద్ధి మారుతుందేమో అని వేచి చూసింది. కానీ చివరికి పహల్గాం ఉగ్ర దాడి వెనక తమ కుట్ర కోణాన్ని చూపిస్తూ మరింతగా రెచ్చిపోతున్న పాక్ కి ఇక తప్పదని మోడీ ప్రభుత్వం చేయాల్సినదంతా చేసింది నీరూ రక్తం కలసి పారవని స్పష్టంగా మోడీ చెప్పేశారు. దాంతో పాక్ నోట్లో పచ్చి వెలక్కాయ పడిపోయింది.

**దుర్భిక్షంలో పాక్ :** నీరు ఉంటేనే సంపద, నీరు ఉంటేనే వ్యవసయాం, పాక్ లో తొంబై శాతం వ్యవసాయం అంతా సింధూ నదీ జలాల నుంచే సాగుతోంది. అలాగే దాహార్తికి అవే నీరు అందుతోంది.



అలాంటిది సింధూ నదీ జలాలు పారకపోయేసరికి పాక్ దిక్కుతోచనిది అవుతోంది. దేశం దుర్భిక్షం వైపుగా సాగుతోంది అని ఆందోళన పడుతోంది. తమను ఆదుకోవాలని భారత్ తో చెప్పించి తిరిగి సింధూ నదీ జలాల ఒప్పందం జరిగేలా చూడాలని వేడుకుంటోంది. అంతే కాదు భారత్ కక్షతో ఈ విధంగా చేస్తోంది అని చెబుతూ సానుభూతి పొందే ప్రయత్నం చేస్తోంది.

**పాక్ దేశమే దాసోహం :** సింధూ నదీఎ జలాలకు పాక్ దేశం మొత్తం దాసోహం అన్నట్లుగా అక్కడ పరిస్థితి ఉంది. ఆ నీరే వారికి సర్వాధారం గా ఉంటుంది గత తొమ్మిది నెలలుగ ఈ నీరు లేకపోవడంతో తర్బెలా డ్యామ్ అలాగే, మంగళ డ్యామ్?లలో నీటి నిల్వల ప్రమాణాలు దారుణంగా పడిపోయాయి. వచ్చేది మండు వేసవి కాలం. ఇప్పటికే డ్యాములలో నీటి మట్టాల స్థాయి పడిపోయి డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుకున్నాయి. ఈ పరిణామాలతో పాక్ బెంబేలెత్తుతోంది. ఇక తమ పని సరి అని అనుకుంటోంది భారత్ నుంచి సింధుని విడమని మొక్కని మొక్కు లేదని చెబుతున్నారు.

**ఎందరికి చెప్పినా :** ఇక భారత్ మీద ఫిర్యాదులు పితూరీలు, ఆరోపణలు ఏడుపులు అక్కసు అంతా అంతర్జాతీయ వేదికల మీద సంస్థల వద్ద పాక్ చెప్పుకుని తెగ ఆయాసపడిపోతోంది. ఒకటేమిది ఐక్యరాజ్యసమితితో మొదలెట్టి ఆ మీదట భద్రతా మండలి దాకా అటు నుంచి షాంఘై సహకార సంస్థ వద్ద, ఇంకా ముందుకెళ్ళి ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ వేదికలపై భారత్? దేశం మీద పడి ఏడుస్తూ పాక్ నంగనాచిలా ఫిర్యాదులు చేస్తోంది. తమకేమీ తెలియదని తాను సుద్ధ పూసలమని అకారణంగా సింధూ నదీ ఒప్పందాన్ని భారత్ కాదని పక్కకు పోయిందని దాయాది దేశం వగలు పోతోంది.

## 680 కి.మీ. తర్వాత యూటర్న్... ట్రంప్ విమానానికి ఏమైంది..!

స్విట్జర్లాండ్ లోని దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో బుధవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొని, ప్రసంగించనున్న సంగతి తెలిసిందే. దీనిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో అమెరికా కాలమానం ప్రకారం రాత్రి 11:07 గంటలకు బయలుదేరిన ఆయన ప్రయాణిస్తున్న విమానం "ఎయిర్ ఫోర్స్ వన్" యూటర్న్ తీసుకుని తిరిగి మేరీల్యాండ్ లోని బేస్ ఆండ్రూస్ లో ల్యాండ్ అయ్యింది. దీంతో.. ఈ విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అవును... మంగళవారం రాత్రి స్విట్జర్లాండ్ లోని దావోస్ కు అధ్యక్షుడు ట్రంప్ తో బయలుదేరిన ఎయిర్ ఫోర్స్ వన్ విమానం టేకాఫ్ అయిన గంటలోపు తిరిగి మేరీల్యాండ్? కు చేరుకుంది. ఈ విషయాన్ని వైట్ హౌస్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా స్పందించిన వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్.. జాయింట్ బేస్ ఆండ్రూస్ నుండి టేకాఫ్ అయిన తర్వాత సిబ్బంది 'చిన్న విద్యుత్ సమస్య'ను గుర్తించారని.. దీంతో చాలా జాగ్రత్తగా తిరిగి బేస్ కు రావాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. ప్రెసిడెంట్ ప్రయాణిస్తున్న



విమానం టేకాఫ్ అయిన తర్వాత ప్రెస్ క్యాబిన్ లోని లైట్లు కొద్దిసేపు ఆరిపోయాయని లీవిట్ విలేకరులు చెప్పారు. ఈ నేపథ్యంలో విమానాన్ని జాగ్రత్తగా వెనక్కి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. దీంతో.. ట్రంప్ మరో విమానంలో దావోస్ వెళ్తారని ఆమె వివరించారు. వాస్తవానికి.. ప్రపంచ ఆర్థిక వేదిక కోసం దావోస్ కు వెళ్తున్న ట్రంప్.. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 8:30 గంటలకు ప్రసంగించాల్సి ఉంది. అయితే ఇది ఆలస్యం కావొచ్చని అంటున్నారు. కాగా... అమెరికాలోని వాషింగ్టన్ నుంచి స్విట్జర్లాండ్ కు విమానంలో దాదాపు 6,785 కిలో మీటర్ల ప్రయాణం ఉంటుంది! ఈ క్రమంలో ట్రంప్ బయలుదేరిన ఎయిర్ ఫోర్స్ వన్ విమానం... టెకాఫ్ అనంతరం సుమారు 680 కి.మీ. ప్రయాణించిన తర్వాత యూటర్న్ తీసుకుని తిరిగి టెకాఫ్ అయిన స్థానానికి చేరుకుంది. గ్రీన్ లాండ్‌కు గట్టి మద్దతుదారుగా నిలుస్తున్న ఫ్రాన్స్ పై ట్రంప్ సుంకాలతో విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... 200 శాతం సుంకాలను విధిస్తానని బెదిరించారు. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ స్పందించారు. దావోస్ కు వచ్చిన ట్రంప్ తో తాను భేటీకి సిద్ధమని.. ఈ సమయంలో జీ7 దేశాల నేతలను ఆహ్వానిస్తానని.. వారితోపాటు ఉక్రెయిన్, డెన్మార్క్, సిరియా, రష్యా వారినీ పిలుస్తానని మెక్రాన్ తాజాగా తెలిపారు. అంతేకాదు.. గురువారం ట్రంప్ ను విందుకు తీసుకెళ్తానని చెప్పారు. దీంతో దావోస్ వేదికగా ట్రంప్ - మెక్రాన్ భేటీపై ఆసక్తి నెలకొంది!

## మినీ డ్రెస్ లో బుట్టబొమ్మ అందాలు!

2010లో మిస్ యూనివర్స్ ఇండియా అందాల పోటీలలో పాల్గొన్న పూజా హెగ్డే.. 2012లో వచ్చిన 'ముగమూడి' అనే తమిళ చిత్రం ద్వారా నటన రంగ ప్రవేశం చేసింది. అటు తెలుగులో 2014లో నాగచైతన్య హీరోగా నటించిన 'ఒక లైలా కోసం' అనే సినిమాలో నటించి తన పాత్రకు విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అదే ఏడాది ప్రిన్స్ హీరో వరుణ్ తేజ్ తో కలిసి 'ముకుందా' అనే సినిమాలో నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది ఈ ముద్దుగుమ్మ. తెలుగులో వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న సమయంలోనే హిందీలో 2016లో హృతిక్ రోషన్ సరసన మోహెంజోదారో సినిమా ద్వారా హిందీ రంగ ప్రవేశం చేసింది. ఇకపోతే ప్రస్తుతం ఈమె ప్రముఖ కోలీవుడ్ స్టార్ హీరో, రాజకీయ నాయకుడు విజయ్ దళపతి ఆఖరి చిత్రం 'జననాయగన్' చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా ఈ ఏడాది జనవరి 9వ తేదీన విడుదల కావాల్సి ఉండగా.. సెన్సార్ జాప్యం వల్ల విడుదల ఆలస్యం అవుతుంది. ఇంకా ఈ సినిమా విడుదల తేదీ పై క్లారిటీ వెలువడలేదు. మరొకవైపు ఈమెకు సంబంధించిన ఒక విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారిన



విషయం తెలిసిందే. పూజ హెగ్డే మాట్లాడుతూ.. నేను ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఒక స్టార్ హీరో నా క్యారవాన్ లోకి వచ్చి నాపై చేయి వేశాడు. ఆ సమయంలో ఏం చేయాలో తెలియలేదు. అలా అని సైలెంట్ గా ఉండిపోలేదు. ఆ స్టార్ హీరో చెంప చెల్లుమనిపించాను. ఇక అదే సినిమాలో ఆ స్టార్ హీరో తో నాకు కొన్ని సన్నివేశాలు ఉన్నా.. డూపు పెట్టి సన్నివేశాలు కంప్లీట్ చేశాము .ఇక ఆ తర్వాత నుంచి అతడితో కలిసి నేను స్క్రీన్ షేర్ చేసుకోలేదు" అంటూ పూజా హెగ్డే తెలిపింది. అయితే ఇది ఆమె స్వయంగా తెలిపిందా లేక ఎవరైనా ఆమె ఐడి పై ఇలా కామెంట్లు చేశారా అన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. మరొకవైపు ఇన్స్టాగ్రామ్ ద్వారా పూజా హెగ్డే షేర్ చేసిన ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. మినీ డ్రెస్ ధరించి మెట్లపై స్టైలిష్ లుక్ లో ఫోటోలకు ఫోజులిచ్చింది. స్టన్నింగ్ లుక్ లో పూజా హెగ్డే షేర్ చేసిన ఈ ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. బుట్టబొమ్మ ఎప్పుడూ తన అందంతో అభిమానులను ఆకట్టుకుంటుంది అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఇకపోతే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె తన ఫిట్నెస్ గురించి తాను తీసుకునే ఫుడ్ డైట్ గురించి చెప్పుకొచ్చింది. నేను ప్రతిరోజు పండ్లు తీసుకుంటాను. అలాగే రోటీ , సబ్జీ, చేపలు అంటే చాలా ఇష్టం. ముఖ్యంగా ఇంట్లో తయారు చేసింది ఏదైనా సరే నేను ఇష్టంగా తింటాను. ముఖ్యంగా నాకు పిజ్జా అంటే ఇష్టం. కానీ కాఫీ , సలాడ్ వంటివి ఇష్టం ఉండదు అంటూ పూజా హెగ్డే తెలిపింది.

## మిగతా హీరోలకు నానికి ఉన్న తేడా ఇదే..

న్యాచురల్ స్టార్ నాని బాక్సాఫీస్ వద్ద తనదైన ముద్ర వేస్తూ దూసుకుపోతున్నారు. ముఖ్యంగా కోవిడ్ తర్వాత చాలామంది హీరోలు తమ సినిమాల మధ్య ఏళ్ల తరబడి గ్యాప్ తీసుకుంటుంటే, నాని మాత్రం పక్కా ప్లానింగ్తో బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్లో పెడుతున్నారు. ప్రతి సినిమాకు కనీసం 7 నుండి 10 నెలల గ్యాప్ ఉండేలా చూసుకుంటూ, ఆడియన్స్కు బోర్ కొట్టకుండా వెరైటీ సబ్జెక్టులతో పలకరిస్తున్నారు. కోవిడ్ తర్వాత 2021 డిసెంబర్ 24న శ్యామ్ సింగరాయ్ తో మొదలైన ఈ జర్నీ, వరుస హిట్లతో కొనసాగుతోంది. ఆ తర్వాత కేవలం 168 రోజుల గ్యాప్తోనే 2022 జూన్ 10న 'అంటే సుందరానికీ..' తో వచ్చారు. బాక్సాఫీస్ లెక్కలు ఎలా ఉన్నా, ఒక సినిమా నుండి మరో సినిమాకు ఆయన చూపిస్తున్న వేరియేషన్ నేటి తరం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. నాని కెరీర్లో బిగ్గెస్ట్ హిట్లలో ఒకటిగా నిలిచిన దసరా 2023 మార్చి 30న విడుదలైంది. ఈ మాస్ అవతారం తర్వాత మళ్ళీ 252 రోజుల గ్యాప్తో 2023 డిసెంబర్ 7న హాయ్ నాన్న అనే క్యూట్ ఫ్యామిలీ డ్రామాతో వచ్చి క్లాస్ ఆడియన్స్ను మెప్పించారు. ప్రతి సినిమాకు ఒక డిఫరెంట్ లుక్, సరికొత్త బాడీ లాంగ్వేజ్తో నాని తన న్యాచురల్ యాక్టింగ్తో సెన్సేషన్



క్రియేట్ చేస్తున్నారు. ఇక 2024 ఆగస్టు 29న సరిపోదా శనివారం తో యాక్షన్ మోడ్ లోకి వెళ్ళిన నాని, ఆ తర్వాత కేవలం 245 రోజుల గ్యాప్తో గతేడాది అంటే 2025 మే 1న ఎ×ఖ 3 తో అర్జున్ సర్కార్ ఐపీఎస్ గా థియేటర్లలోకి వచ్చారు. ఈ చిత్రం నాని కెరీర్ లోనే వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ గ్రాసర్స్ గా నిలవడం విశేషం. కేవలం నటుడిగానే కాకుండా నిర్మాతగా కూడా HIT 2, కోర్టు వంటి సినిమాలతో నాని సక్సెస్ ఫుల్ గా దూసుకుపోతున్నారు. ఇప్పుడు అందరి ఫోకస్ ది ప్యారడైజ్ సినిమాపైనే ఉంది. తన ఫేవరెట్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఈ ఏడాది మార్చి 26, విడుదల కావాలి. అయితే షూటింగ్ ఆలస్యం వల్ల డేట్ మరే అవకాశం ఉంది. కానీ మరీ ఎక్కువ గ్యాప్ తీసుకోకుండానే సమ్మర్ లో వచ్చే అవకాశం ఉంది. HIT 3 రిలీజ్ తర్వాత దాదాపు ఏడాది తర్వాత వస్తున్న ఈ సినిమా నాని కెరీర్ లోనే కాస్ట్లియెస్ట్ మూవీగా నిలవనుంది. ఈ సినిమా కోసం నాని తన లుక్ ను కంప్లీట్ గా మార్చేశాడు. పక్కా ప్రణాళికతో, గ్యాప్ లేకుండా కష్టపడుతూ నాని టాలీవుడ్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. నటుడిగా ఎంత బిజీగా ఉన్నా, నిర్మాతగా కొత్త టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ ఉండటం ఆయన గొప్పతనం. మరి నెక్స్ట్ రాబోయే ది ప్యారడైజ్ బాక్సాఫీస్ వద్ద ఇంకెన్ని రికార్డులను తిరగరాస్తుందో చూడాలి.


### సినిమా 'షో'

## సంక్రాంతి విన్నర్స్: బ్రేక్ ఈవెన్ ఎన్ని రోజుల్లో ఫినిష్ చేశారంటే..



ఈ ఏడాది సంక్రాంతి బాక్సాఫీస్ వద్ద తెలుగు సినిమాలు కాసుల వర్షం కురిపించాయి. పెద్ద హీరోలతో పాటు మీడియం రేంజ్ హీరోలు కూడా తమ సత్తా చాటుతూ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచారు. పండుగ సెలవులను పక్కాగా వాడుకుంటూ, విడుదలైన వారం రోజుల్లోనే మెజారిటీ సినిమాలు సేఫ్ జోన్లోకి వచ్చేయడం విశేషం. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, ప్రస్తుత కలెక్షన్ల ట్రెండ్ చూస్తుంటే సంక్రాంతి విన్నర్స్ ఎవరనేది క్లియర్గా అర్థమవుతోంది. ముందుగా మెగాస్టార్ చిరంజీవి 'మన శంకరవరప్రసాద్ గారు' బాక్సాఫీస్ వద్ద ఊరమాస్ విధ్వంసం సృష్టించింది. ఈ సినిమా సుమారు 122 కోట్ల బ్రేక్ ఈవెన్ టార్గెట్?తో బరిలోకి దిగగా, కేవలం 6 రోజుల్లోనే ఆ మార్కును దాటేసింది. దాదాపు 26.93 కోట్ల లాభాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. వింటేజ్ చిరు కామెడీకి ఆడియన్స్ బ్రహ్మరథం పడుతుండటంతో లాంగ్ రన్ లో ఈ లెక్క ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఇక ఈ సంక్రాంతికి అసలైన ట్విస్ట్ ఇచ్చింది నవీన్ పొలిశెట్టి సినిమా. ఆయన నటించిన 'అనగనగా ఒక రాజు' కేవలం 4 రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకుని అందరినీ షాక్ కు గురిచేసింది. 28 కోట్ల టార్గెట్?తో వచ్చిన ఈ సినిమా, ఇప్పటివరకు 37.59 కోట్ల షేర్ సాధించి సూపర్ హిట్ స్టేటస్ అందుకుంది. సుమారు 9.57 కోట్ల లాభాలను ఖాతాలో వేసుకున్న నవీన్, తన కామెడీ టైమింగ్?తో యూత్?ను ఫ్యామిలీ ఆడియన్స్?ను థియేటర్లకు రప్పించడంలో సక్సెస్ అయ్యారు. శర్వానంద్ నటించిన 'నారి నారి నడుమ మురారి' కూడా సైలెంట్?గా వచ్చి డీసెంట్ హిట్?గా నిలిచింది. 10.25 కోట్ల వాల్యూ బ్రేక్ ఈవెన్ టార్గెట్?తో రిలీజైన ఈ సినిమా, 7 రోజుల్లో గమ్యాన్ని చేరుకుంది. ఇప్పటివరకు వరల్డ్ వైడ్ గా 11.29 కోట్ల షేర్ వసూలు చేసి, సుమారు 1.04 కోట్ల లాభంతో కొనసాగుతోంది. అన్ని ఏరియాల్లోనూ బ్రేక్ ఈవెన్ దాటేయడంతో, డిస్ట్రిబ్యూటర్లు సేఫ్ జోన్ లోకి వచ్చేశారు. ట్రేడ్ అనలిస్టుల సమాచారం ప్రకారం, ఈ సినిమాలన్నీ దాదాపుగా అంచనాలను అందుకున్నాయి. పక్కా కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న చిరు సినిమాకు మాస్ ఆడియన్స్, నవీన్ సినిమాకు యూత్, శర్వానంద్ సినిమాకు ఫ్యామిలీ ఆడియన్స్ తోడవ్వడం ఈ విజయాలకు ప్రధాన కారణం. గత ఏడాది సంక్రాంతితో పోలిస్తే, ఈసారి సక్సెస్ రేటు చాలా ఎక్కువగా ఉండటం ఇండస్ట్రీకి శుభపరిణామం అని చెప్పవచ్చు. ఏదేమైనా ఈ సంక్రాంతి సీజన్ ముగిసే సమయానికి బయ్యర్లంతా హ్యాపీగా ఉన్నారు. రవితేజ నటించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కూడా తనదైన శైలిలో వసూళ్లను రాబడుతుండగా, ప్రభాస్ రాజాసాబ్ మాత్రం టార్గెట్ విషయంలో చాలానే వెనుకబడింది. ఆ సినిమా ఇంకా దాదాపు 40% శాతం వెనక్కి తీసుకు రావాల్సి ఉంది. ఇక మిగిలిన వర్కింగ్ డేస్?లో ఈ సినిమాలు ఎలా హోల్డ్ చేస్తాయో చూడాలి.

## కృతి శెట్టి అలా.. కీర్తి సురేష్ ఇలా.. అదృష్టం ఎవరివైపు?



ఈ మధ్యకాలంలో చాలామంది హీరోయిన్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ఇతర భాషలపై ఆసక్తి కనబరుస్తున్న విషయం తెలిసిందే. అయితే అలా అడుగుపెట్టిన వారికి ఆ సినీ పరిశ్రమ ఘన స్వాగతం పలికినా.. ఒక్కొక్కసారి ఆ సినిమాల ఫలితాలు వారికి పూర్తిస్థాయిలో నిరాశను మిగులుస్తూ ఉంటాయి. ఉదాహరణకు భారీ అంచనాల మధ్య సరైన సక్సెస్ అందుకోవడానికి యంగ్ బ్యూటీ శ్రీ లీల ఇటీవల కోలీవుడ్ రంగ ప్రవేశం చేసింది. సుధా కొంగర దర్శకత్వంలో 1969లో జరిగిన హిందీ వ్యతిరేకత నిరసనలను ఆధారంగా చేసుకొని 'పరాశక్తి' సినిమాను తెరకెక్కించారు. శివ కార్తికేయన్ హీరోగా నటించారు. ఎన్నో ఆశలతో ఈ సినిమాతో తొలి కోలీవుడ్ రంగ ప్రవేశం చేసింది శ్రీ లీల. అయితే అక్కడ ఈమెకు ఎదురుదెబ్బే మిగిలింది. ఈ సినిమాను కొంతమంది బాగుంది అని చెప్పినా చాలా వరకు ఈ సినిమాపై విమర్శలు వెల్లువెత్తాయి. పైగా బ్యాన్ చేయాలని డిమాండ్లు కూడా వినిపించాయి. దాంతో అమ్మడికి నిరాశ తప్పలేదు అని చెప్పాలి. ఇక ఈ సినిమా నిరాశ మిగిల్చినా.. మరొకవైపు హీరో ప్రదీప్ రంగనాథన్ ఏజిఎస్ నిర్మాణంలో నటించి, దర్శకత్వం వహిస్తున్న ఒక కొత్త సినిమాలో అవకాశం అందుకున్నట్లు సమాచారం. ఒకవేళ ఈ సినిమా సక్సెస్ అయితే ఈమెకు కోలీవుడ్ లో మరిన్ని అవకాశాలు తెలుపుతట్టే అవకాశం కనిపిస్తుంది. ఇదిలా ఉండగా మరొకవైపు శ్రీ లీలాతో పాటు తెలుగులో సినీ ఇండస్ట్రీకి పరిచయమైన బ్యూటీ కృతిశెట్టి. ఈమె కూడా కన్నడ ఇండస్ట్రీకి చెందినవారే. ఉప్పెన సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన ఈమె.. ఆ తర్వాత బంగార్రాజు, శ్యామ్ సింగరాయ్ వంటి చిత్రాలతో భారీ విజయాలను తన ఖాతాలో వేసుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలోనే హ్యాట్రిక్ అందుకున్న ఈమె.. ఆ తర్వాత వరుస సినిమాలు చేసింది కానీ పెద్దగా కలిసి రాలేదు. దీంతో తన అదృష్టాన్ని పక్క భాషలో పరీక్షించుకోవాలనుకుంది. అందులో భాగంగానే కార్తీతో 'వా వాతియర్ణ అనే సినిమాలో నటించింది. అయితే ఈ సినిమా ఇప్పటికీ కూడా విడుదలకు నోచుకోలేదు. దీంతో ప్రదీప్ రంగనాథన్ తో ' ూ×ఖ ' (లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ) అనే సినిమాలో నటించింది. ఈ సినిమా కూడా పోస్ట్ పోన్ కావడంతో ఈమెకు అదృష్టం కలిసి రాలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇకపోతే మరోవైపు గత కొద్ది రోజులుగా ఈమె బాలీవుడ్ లో సినిమా చేస్తోంది అంటూ వార్తలు వినిపించాయి. దీనికి తోడు గతంలో కృతి శెట్టి ముంబైలో కనిపించడంతో.. బాలీవుడ్ ఆఫర్ వచ్చిందని అందుకే ఆమె అక్కడే ఆడిషన్ కి హాజరవుతోంది అని కూడా వార్తలు వచ్చాయి. దీంతో కోలీవుడ్ లో ఎలాగో ఆమె సినిమాలు విడుదలకు నోచుకోలేదు.. కనీసం బాలీవుడ్ లోనైనా ఆమెకు అదృష్టం కలిసి వస్తుందని అందరూ భావించారు. అయితే చివరికి కృతి శెట్టికి బదులుగా ఆ ప్రాజెక్టులోకి కీర్తి సురేష్ ఎంటర్ అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈమె బేబీ జాన్ సినిమాతో హిందీలో అడుగుపెట్టినా.. ఆ సినిమా ఫ్లాప్ అయింది. కనీసం ఈ సినిమా అయినా ఈమెకు కలిసి వస్తుందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు అభిమానులు. ఏది ఏమైనా కృతి శెట్టి అలా.. కీర్తి సురేష్ ఇలా.. మరి ఎవరికి అదృష్టం కలిసి వస్తుందో చూడాలి.

## మృణాల్ మరో తెలుగు మూవీ.. ఏంటి సంగతి?

హీరోయిన్ మృణాల్ ఠాకూర్ కు టాలీవుడ్ లో మంచి క్రేజ్ ఉన్న విషయం తెలిసిందే. తన అందం, అభినయంతో అదిరిపోయే ఫేమ్ ను సొంతం చేసుకుంది అమ్మడు. సీతారామం మూవీతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన బ్యూటీ, డెబ్యూతో సూపర్ హిట్ ను అందుకున్నారు. అంతకుమించి స్పెషల్ ఫ్యాన్ బేస్ ను కూడా క్రియేట్ చేసుకున్నారు. ఆ తర్వాత హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్స్ సినిమాల్లో నటించిన మృణాల్.. ఇప్పుడు యంగ్ హీరో అడవి శేష్ సరసన డెకాయిట్ మూవీలో హీరోయిన్ గా యాక్ట్ చేస్తున్నారు. ఆ సినిమాతో ఉగాది కానుకగా మార్చి 19వ తేదీన థియేటర్స్ లో సందడి చేస్తున్నారు. రీసెంట్ గా మూవీ నుంచి గ్లింప్స్ రిలీజ్ అవ్వగా.. మృణాల్ తన ప్రామెసింగ్ యాక్షన్ తో అందరినీ ఆకట్టుకున్నారు. అయితే తాజాగా ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టారు మృణాల్ ఠాకూర్. కొత్త ఏడాది.. కొత్త స్క్రిప్ట్.. కొత్త బిగినింగ్ అంటూ రాసుకొచ్చారు. సాబ్ న్యూ న్యూ.. అంటూ హలో హైదరాబాద్ అంటూ పలకరించారు. దీంతో ఆమె ప్రస్తుతం హైదరాబాద్ లోనే ఉన్నట్లు క్లియర్ గా తెలుస్తోంది. అదే



సమయంలో మరో తెలుగు మూవీలో యాక్ట్ చేస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. కానీ ఆ సినిమా ఏంటన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. నిజానికి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ లీడ్ రోల్ లో కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తున్న భారీ ప్రాజెక్టులో మృణాల్ యాక్ట్ చేస్తున్నట్లు కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. షూటింగ్ లో పాల్గొంటున్నట్లు కూడా టాక్ వినిపించింది. కానీ దీనిపై మృణాల్ గానీ.. మూవీ టీమ్ గానీ ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటించలేదు. దీంతో మృణాల్ ఆ సినిమా గురించి పోస్ట్ పెట్టి ఉండవచ్చని కొందరు నెటిజన్లు భావిస్తున్నారు. అయితే కొత్త స్క్రిప్ట్ అని ఆమె మెన్షన్ చేయడంతో ఆ మూవీ కాదని మరికొందరు కామెంట్లు పెడుతున్నారు. ఆమె చెప్పిన కొత్త కథ మరో కొత్త ప్రాజెక్ట్ కు సంబంధించినది అయ్యి ఉండొచ్చని అంటున్నారు. ఏదేమైనా ఇప్పుడు మృణాల్ ఠాకూర్ పోస్ట్.. వైరల్ గా మారి చర్చకు దారితీసింది. అయితే మృణాల్ కొత్త మూవీ దర్శకుడు ఎవరు, హీరో ఎవరు, నిర్మాతలు ఎవరు అన్న వివరాలపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. త్వరలోనే ఆ కొత్త ప్రాజెక్ట్ పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఏదేమైనా మృణాల్ ఒక్క పోస్ట్ తో ఆమె తన కొత్త తెలుగు ప్రాజెక్ట్ వైపు అందరి దృష్టి తిప్పుకున్నారు. మరి ఆ మూవీ వివరాలు ఎప్పుడు వస్తాయో వేచి చూడాలి.

## మెగాస్టార్ విధ్వంసం.. తమ్ముడి రికార్డులను బ్రేక్ చేసిన అన్నయ్య!

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఇప్పుడు ఒక పేరు గట్టిగా వినిపిస్తోంది. అదే మెగాస్టార్ చిరంజీవి. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన మన శంకర వరప్రసాద్ గారు సినిమా బాక్సాఫీస్ దగ్గర సరికొత్త రికార్డులను క్రియేట్ చేస్తోంది. పండగ విన్నర్గా నిలవడమే కాదు, ఏకంగా ఇండస్ట్రీ రికార్డులను తిరగరాస్తోంది. ముఖ్యంగా తమ్ముడు పవన్ కళ్యాణ్, కొడుకు రామ్ చరణ్ సృష్టించిన రికార్డులను ఈ వయసులో చిరంజీవి బ్రేక్ చేస్తుండటం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్గా మారింది. అసలు మ్యాటర్ లోకి వస్తే, బుక్ మై షో సేల్స్ లో ఈ మెగా మూవీ ఒక ఫీట్ సాధించింది. పవన్ కళ్యాణ్ నటించిన ూ+ సినిమా ఫుల్ రన్ లో సాధించిన 2.78 మిలియన్ల టికెట్ సేల్స్ రికార్డును, మన శంకర వరప్రసాద్ గారు కేవలం ఆరు రోజుల్లోనే క్రాస్ చేసేసింది. ప్రస్తుతం 2.81 మిలియన్లకు పైగా టికెట్ సేల్స్తో బాక్సాఫీస్ వద్ద అన్నయ్య సినిమా సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. తమ్ముడి సినిమా లైఫ్ టైమ్ సేల్స్ ని అన్నయ్య కేవలం



వారం లోపే దాటేయడం మెగా పవర్ కు నిదర్శనం. కేవలం తమ్ముడి రికార్డులే కాదు, కొడుకు రామ్ చరణ్ సినిమా రికార్డులపై కూడా మెగాస్టార్ దండయాత్ర చేశారు. గతంలో === సినిమా పేరు మీద ఉన్న డే 5 కలెక్షన్స్ ఇండస్ట్రీ రికార్డును మీూ+ బ్రేక్ చేసింది. ఐదో రోజు అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా నిలిచి, చరణ్ రికార్డును చిరంజీవి చెరిపేశారు. ఇక ఏపీ, తెలంగాణలో ఆరో రోజు అత్యధిక షేర్ వసూలు చేసిన సినిమాల్లో కూడా అనిల్ రావిపూడి సినిమాలే టాప్ లో ఉండటం విశేషం. సంక్రాంతికి వస్తున్నాం 14.05 కోట్లు, తర్వాత మీూ+ 13.85 కోట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఇక ఓవర్సీస్ బాక్సాఫీస్ లో కూడా మెగాస్టార్ మేనియా మామూలుగా లేదు. నార్త్ అమెరికాలో సైరా నరసింహారెడ్డి రికార్డులను అధిగమించి, చిరంజీవి కెరీర్లోనే హయ్యస్ట్ గ్రాసర్గా ఈ సినిమా నిలిచింది. త్వరలోనే అక్కడ 3 మిలియన్ డాలర్ల మార్కును టచ్ చేయబోతోంది. కేవలం ఆరు రోజుల్లోనే అన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకుని, క్లీన్ హిట్ స్టేటస్ అందుకోవడం మెగాస్టార్ రేంజ్ ఏంటో చూపిస్తోంది. మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్ల ప్రకారం, ఈ సినిమా కేవలం 6 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా 261 కోట్ల గ్రాస్ వసూలు చేసింది.

Printed, Published, and Owned by **KOKKU RAVI KUMAR** Editor: **KOKKU RAVI KUMAR**, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003.
Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com